E-KABURU E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com
(తేదీ) 24-09-2025 (వారం) బుధవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com


కోర్టు ధిక్కరణపై హైకోర్టుకే వెళ్లండి 3లో

# ప్రపంచం కీర్తించేలా మేడారం: సీఎం రేవంత్

- యేళ్లు నిలిచేలా మేడారం సమ్మక్క, సారలమ్మ ఆలయ పునర్నిర్మాణం : సీఎం రేవంత్
- ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని నిలబడేలా ప్రణాళికలు సిద్ధం
- అమ్మల ఆశీర్వాదంతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడింది
- ఆలయం అభివృద్ధికి ఎన్ని నిధులైనా వెచ్చిస్తాం
- తెలంగాణ కుంభమేళాను కేంద్రం గుర్తించాలి..నిధులు ఇవ్వాలన్న సీఎం
- ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం.. గద్దెల కొత్త డిజైన్లు విడుదల



తరువాయి 2లో

## మావోల రక్షణ దళంలో కోవర్టులు

- మావో అగ్రనేతలకు ముప్పుగా బాడీగార్డులు
- నంబాల నుంచి నేటి ఎన్‌కౌంటర్ వరకు ఇదే పరిస్థితి
- అకస్మాత్తుగా పోలీసులకు లొంగిపోతున్న రక్షణ దళ సభ్యులు



## జీడీపీ వృద్ధి 6.5 శాతం
» 4లో




## సందీప్ వంగా చిత్రంలో అనంతిక!
» 5లో



# సమాజాన్ని.. దేశాన్ని మేల్కొలిపే శక్తిమంతమైన మాధ్యమం సినిమా

- జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని అందుకున్న మోహన్‌లాల్



ఈకబురు, "సినిమా కేవలం ఓ పరిశ్రమ కాదు. సమాజాన్ని.. దేశాన్ని మేల్కొలిపే శక్తిమంతమైన మాధ్యమం" అన్నారు భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము. ప్రస్తుతం మహిళల్ని కేంద్రంగా చేసుకుని మంచి సినిమాలు నిర్మితమవుతున్నాయని.. అవి చక్కటి ప్రేక్షకాదరణతో పాటు గుర్తింపును పొందుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. మంగళవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన 71వ జాతీయ చలన చిత్ర పురస్కారాల ప్రదానోత్సవ వేడుకలో విజేతలకు అవార్డులు అందించారు ముర్ము. దీనిలో భాగంగా భారతీయ చలన చిత్రపరిశ్రమలోని అత్యంత ప్రతిష్ఠాత్మక 'దాదా సాహెబ్ ఫాల్కే' అవార్డుతో నటుడు మోహన్‌లాల్‌ను సత్కరించారు రాష్ట్రపతి. ఈ అవార్డును అందుకున్న పిన్నవయస్కుడిగా (65) రికార్డు సాధించారు మోహన్‌లాల్.రాష్ట్రపతి మాట్లాడుతూ.. సినిమా రంగంలో మహిళా దర్శకుల సంఖ్య తక్కువగా ఉండటాన్ని ప్రస్తావించారు. విద్యా రంగంలో విద్యార్థినులు జైత్రయాత్ర సాగిస్తున్నట్లే.. చలన చిత్ర అవార్డుల్లోనూ మహిళలు సత్తా చాటే ప్రయత్నం చేయాలన్నారు. దీని కోసం సినీ రంగంలోనూ ఆడవాళ్లకు సమాన అవకాశాలు కల్పించాలన్నారు. జ్యూరీ ప్యానెల్‌లోనూ వాళ్లకు తగిన ప్రాతినిధ్యం ఉండాలని సూచించారు. "ఈరోజు అవార్డులు గెలుచుకున్న చిత్రాల్లో తల్లులు తమ పిల్లలకు నైతిక విలువల్ని నేర్పించే కథలు, సామాజిక నిషేధాల్ని ఎదురించే ధైర్యవంతమైన మహిళల కథలు, పురుషాధిక్యతకు వ్యతిరేకంగా గొంతు విప్పే కథలు ఉన్నాయి. ఇది సమాజానికి ఒక గొప్ప సందేశం" అని ద్రౌపదీ ముర్ము చెప్పారు.

తరువాయి 5లో

## దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం అందుకున్న మోహన్‌లాల్

- అవార్డులు స్వీకరించిన పలువురు తెలుగు సినీ ప్రముఖులు
- ఘనంగా జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం

తరువాయి 5లో



# మాటలే.. చేతల్లేవ్
3లో



- అద్భుత సామర్థ్యమున్నా సరిగా పని చేయట్లేదు
- ఐక్యరాజ్య సమితిపై ట్రంప్ ఆగ్రహం
- ప్రపంచ నేతల సమక్షంలో విమర్శ
- భారత్, పాక్ సహా 7 యుద్ధాల్ని ఆపానని మళ్లీ వ్యాఖ్య
- రష్యా యుద్ధానికి భారత్, చైనాల నిధులు ఊతమని విమర్శ
- నాటో అదే తీరని ధ్వజం

ఈకబురు, ఐరాస: ప్రపంచ దేశాధినేతల సమక్షంలో అంతర్జాతీయ సంస్థ ఐక్యరాజ్య సమితిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. పలు యుద్ధాలను ఆపేందుకు తాను ప్రయత్నిస్తున్న సమయంలోనూ కనీసం ఆ సంస్థ తనను సంప్రదించలేదని మండిపడ్డారు. 150 దేశాల నేతలు హాజరైన ఐరాస సర్వప్రతినిధి సభ సమావేశంలోనే ఆయన ఆ సంస్థను తీవ్రంగా తప్పుబట్టారు. ఆ సంస్థవి ఉత్త మాటలేనని, చేతల్లేవని ధ్వజమెత్తారు. దీంతోపాటు భారత్‌పాక్ యుద్ధంపైనా మళ్లీ ఆయన పాత పాటే పాడారు. యుద్ధాన్ని తానే ఆపానని చెప్పారు. అంతేకాదు.. ఏకంగా 7 యుద్ధాలను ఆపానని ప్రకటించుకున్నారు. మంగళవారం న్యూయార్క్‌లో ప్రారంభమైన ఐరాస సభ 80వ సెషన్‌లో ట్రంప్ 56 నిమిషాలపాటు ప్రసంగించారు. రెండోసారి అధ్యక్షుడయ్యాక ఐరాస వేదికగా ప్రపంచ నేతలను ఉద్దేశించి ఆయన ప్రసంగించడం ఇదే ప్రథమం. అంతే కాదు.. ఇంతవరకూ ఏ అమెరికా అధ్యక్షుడూ ఐరాసలో ఇంతసేపు ప్రసంగించలేదు. పని చేయని టెలిప్రాంప్టర్‌పై జోక్‌తో ఆయన తన ప్రసంగాన్ని ప్రారంభించారు. 'ఐరాసకు గొప్ప సామర్థ్యముందని నేను ఎల్లప్పుడూ చెబుతూ ఉంటా. కానీ అది కనీసం దానికి దగ్గరికి చేరుకోవడానికీ ప్రయత్నించదు. ఇప్పటికైనా అది బలమైన పదాలతో లేఖ రాయడానికిగానీ, దానిని పాటించడానికిగానీ ముందుకు రాదు. అది ఉత్త పదాలనే రాస్తుంది. అవి యుద్ధాలను పరిష్కరించలేవు' అని ట్రంప్ విమర్శించారు.

తరువాయి 5లో

## రూ.3,745 కోట్ల పెట్టుబడి... 1,518 మందికి ఉపాధి



- మూడు కంపెనీలకు మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం

ఈకబురు,హైదరాబాద్: రాష్ట్రంలో రూ.3,745 కోట్ల పెట్టుబడులు పెట్టి 1,518 మంది యువతకు ఉపాధి కల్పించడానికి ముందుకొచ్చిన మూడు కంపెనీలకు మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. మంగళవారం సచివాలయంలో పారిశ్రామిక ప్రోత్సాహకాల మంత్రివర్గ ఉపసంఘం సమావేశం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగింది. ఇందులో కమిటీ సభ్యులైన మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భట్టి మాట్లాడుతూ..."పండ్లతోటలు సాగు చేసే రైతులను ప్రోత్సహించే పరిశ్రమల ఏర్పాటుకు పలు కంపెనీలు పెద్దఎత్తున ఆసక్తి కనబరుస్తున్నాయి. జేఎస్‌డబ్ల్యూ యూఏవీ లిమిటెడ్ మహేశ్వరంలో రూ.

తరువాయి 2లో

## యూరియా కోసం తోపులాట



- సొమ్మసిల్లి పడిపోయిన మహిళా రైతులు

» 2లో

» 2లో

## దేశంలో అతిపెద్ద సమస్య నిరుద్యోగం: రాహుల్






» 4లో

## మాకు దక్కాల్సిన వాటా 763 టీఎంసీలు: ఉత్తమ్



- కృష్ణాలో వాటా కోసం కృష్ణా ట్రిబ్యునల్ ముందు తెలంగాణ వాదనలు
- నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడి
- ఆల్మట్టి ఎత్తు పెంపుపై సుప్రీంను ఆశ్రయిస్తామన్న మంత్రి

ఈకబురు, న్యూఢిల్లీ: కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు న్యాయంగా 763 టీఎంసీలు దక్కాలని, ఈ వాటాను రాబట్టుకునేలా జస్టిస్ బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ముందు తెలంగాణ వాదనలు వినిపిస్తోందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. కృష్ణా బేసిన్‌లో తెలంగాణలోని పరీవాహక ప్రాంతం, కరువు ప్రాంతాలు, జనాభా ప్రాతిపదికన వాటాలు ఇవ్వాలని కోరుతున్నట్లు వెల్లడించారు. 'కృష్ణా నదీ జల వివాదాల పరిష్కార ట్రిబ్యునల్-2 ఉమ్మడి రాష్ట్రానికి మొత్తంగా 1,050 టీఎంసీల నీటిని కేటాయించింది.

తరువాయి 2లో

మొదటి పేజీ తరువాయి

# మాకు దక్కాల్సిన వాటా 763 టీఎంసీలు: ఉత్తమ్



ఇందులో 75 శాతం డిపెండబులిటీ ఆధారంగా 811 టీఎంసీలు, 65 శాతం డిపెండబులిటీలో 49 టీఎంసీలు, సగటు ప్రవాహాల్లో 145 టీఎంసీలతో పాటు గోదావరి మళ్లింపు జల్లాల్లో 45 టీఎంసీలు కలిపి మొత్తంగా 1050 టీఎంసీలు కేటాయించింది. ఇందులో 70శాతం నీటిని తెలంగాణకు కేటాయించాలని కోరుతున్నాం. అందులో 75శాతం డిపెండబులిటీ కింద 555 టీఎంసీలు, 65 శాతం డిపెండబులిటీ కింద 43 టీఎంసీలు, సగటు ప్రవాహాల కింద 120, గోదావరి మళ్లింపు జల్లాల్లో 45 టీఎంసీలు కలిపి మొత్తంగా 763 టీఎంసీలు కోరుతున్నాం'అని ఉత్తమ్ తెలిపారు. మంగళవారం మొదలైన ట్రిబ్యునల్ విచారణకు మంత్రి స్వయంగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి ఏపీకి జరిగిన 811 టీఎంసీలను ఎక్కువగా బేసిన్ బయట ఉన్నవాటికే కేటాయించారని, ఈ నీటిని తెలంగాణలోని కరువు పీడిత ప్రాంతాలకు అందించేలా న్యాయం చేయాలని ట్రిబ్యునల్‌ను కోరుతున్నామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు ఇవ్వాలని లిఖిత పూర్వకంగా రాసిచ్చారని, ఈ అన్యాయాన్ని సవరించాలని తాము కోరుతున్నామని చెప్పారు. కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా దక్కే వరకు పోరాడుతూనే ఉంటామన్నారు.

**ఆల్మట్టిపై సుప్రీంలో కొట్లాడతాం**

కర్ణాటక నిర్ణయించిన ఆల్మట్టి ఎత్తు పెంపును సైతం తాము అడ్డుకుంటామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఈ విషయమై త్వరలోనే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా, ఏపీలో టీడీపీ, మహారాష్ట్రలో బీజేపీ ప్రభుత్వం ఉన్నా నీటి వాటాల విషయంలో తెలంగాణ రాజీపడదని, ఎవరితోనైనా కొట్లాడతామని స్పష్టం చేశారు.

మొదటి పేజీ తరువాయి

# రూ.3,745 కోట్ల పెట్టుబడి... 1,518 మందికి ఉపాధి



మంగళవారం సచివాలయంలో పారిశ్రామిక ప్రోత్సాహకాల మంత్రివర్గ ఉపసంఘం సమావేశం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగింది. ఇందులో కమిటీ సభ్యులైన మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భట్టి మాట్లాడుతూ..."పండ్లతోటలు సాగు చేసే రైతులను ప్రోత్సహించే పరిశ్రమల ఏర్పాటుకు పలు కంపెనీలు పెద్దఎత్తున ఆసక్తి కనబరుస్తున్నాయి. జేఎస్‌డబ్ల్యూ యూపీవీ లిమిటెడ్ మహేశ్వరంలో రూ.785 కోట్ల పెట్టుబడితో 364 మందికి ఉపాధి కల్పించేలా కొత్త యూనిట్ ప్రారంభించడానికి ముందుకొచ్చింది. తోషిబా కంపెనీ రూ.562 కోట్ల పెట్టుబడితో 554 మందికి ఉపాధి కల్పించడానికి ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం, గ్యాస్ ఇన్సులేటివ్ స్విచ్‌గేర్, బుషింగ్స్ పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. హిందుస్థాన్ కోకా కోలా బెవరేజెస్ కంపెనీ రూ.2,398 కోట్ల పెట్టుబడితో 600 మందికి ఉపాధి కల్పించేలా పరిశ్రమను నెలకొల్పుతుంది. ఈ మూడింటికి ఉపసంఘం ఆమోదం తెలిపింది. కోకా కోలా వంటి కంపెనీల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో మామిడి, నారింజ పంటలకు డిమాండ్ ఏర్పడి రాష్ట్ర రైతులకు గణనీయంగా ఆదాయం సమకూరుతుంది" అని చెప్పారు. వివిధ దేశాల నుంచి మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిన కంపెనీలు.. ఒప్పందాలు, విధి విధానాలపై మంత్రులు సమీక్షించారు.

మొదటి పేజీ తరువాయి

# ప్రపంచం కీర్తించేలా మేడారం: సీఎం రేవంత్



**నాడు పాలకులు సమ్మక్క–సారలమ్మ ఆలయ అభివృద్ధిపై వివక్ష చూపారు. కానీ మా ప్రభుత్వం ఏర్పడటం వల్ల ఆదివాసీ బిడ్డలను అభివృద్ధి చేయడంతో పాటు ఆదివాసీ దేవతల ఆలయాలకు సేవ చేసే భాగ్యం కలిగింది. సమ్మక్క సారలమ్మల గద్దెల అభివృద్ధి, ప్రాంగణ పునర్నిర్మాణంతో మంత్రి సీతక్కకు, నాకు జన్మ ధన్యమైనట్లే. ఆదివాసీలను, పూజారులను,సంప్రదాయ కుటుంబాలను ఆలయ అభివృద్ధిలో భాగస్వాములను చేస్తున్నాం. రాతి కట్టడాలు ఎప్పటికీ చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచిపోయేలా ఉంటాయి. మహా జాతరకు మళ్లీ వస్తా.. ఈసారి జాతరను గొప్పగా చేసుకుందాం..**

**– ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

ఈకబురు, వరంగల్: తెలంగాణ కుంభమేళా నిర్వహించే మేడారం సమ్మక్క-సారలమ్మ ఆలయాన్ని ప్రపంచం కీర్తించేలా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా ప్రకృతి ఒడిలో ఉన్నట్టుగా ఈ ఆలయం ఉందని, ఈ నేపథ్యంలో ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా నిర్మాణాలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. కాకతీయులు నిర్మించిన రామప్ప తరహాలో చరిత్రకు సాక్ష్యాలుగా, వెయ్యేళ్లు నిలిచేలా ఆలయ పునర్నిర్మాణాన్ని రాతి కట్టడాలతో చేపడతామని చెప్పారు. మంగళవారం ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో సమ్మక్క-సారలమ్మ ఆలయ పునర్నిర్మాణం పనులను సీఎం ప్రారంభించారు.

అంతకుముందు మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు, అధికారులు ఆయనకు హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలికారు. అనంతరం సీఎం పోలీసు కమాండ్ కంట్రోల్ రూం ప్రాంగణంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. గిరిజన కొమ్ము కోయ నృత్యంతో, గిరిజన సంప్రదాయం ప్రకారం సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్దకు వెళ్లారు. అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. మాస్టర్ ప్లాన్ పేరుతో రూపొందించిన గద్దెల నూతన డిజైన్లను విడుదల చేశారు. ఆలయం అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఆలయం పనుల ప్రారంభించారు. సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు.

**అమ్మల ఆశీస్సులతోనే ప్రజా ప్రభుత్వం**

'మేడారం జాతర ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందింది. ఇది తెలంగాణ ప్రజల ఆత్మీయత, భక్తి, సంప్రదాయాలకు ప్రతీక. రాష్ట్ర సాంస్కృతిక గొప్పతనాన్ని, గిరిజనుల పోరాట చరిత్రను ప్రతిబింబిస్తుంది. ఆదివాసీలు దేశానికి మూలవాసులు.. పోరాటానికి, పౌరుషానికి స్ఫూర్తి సమ్మక్క, సారలమ్మ తల్లులు. నేను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి అమ్మవార్లను సందర్శిస్తున్నా.

2023 ఫిబ్రవరి 6న ఈ గడ్డ మీదనుంచే పాదయాత్ర మొదలుపెట్టా. అమ్మల ఆశీర్వాదంతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. ఈ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని సంకల్పించింది. శాశ్వత ప్రాతిపదికన గద్దెల ప్రాంగణం, పునర్నిర్మాణం పనులు చేపట్టాం. ఈ ఆలయం డబ్బులతో కొలిచేది కాదు.. నమ్మకంతో కొలిచేది. ఈ నమ్మకాన్ని మరింత పెంచేలా అభివృద్ధి ఉండాలి. ఇందుకోసం ప్రభుత్వం ఎన్ని నిధులైనా కేటాయిస్తుంది.

**ఆదివాసీ కుంభమేళాకు నిధులెందుకివ్వరు..?**

'కుంభమేళాకు వేలకోట్లు ఇస్తున్న కేంద్రం ఆదివాసీ కుంభమేళా మేడారం జాతరకు ఎందుకు నిధులు ఇవ్వడంలేదు? జాతీయ స్థాయిలో మేడారం జాతరకు గుర్తింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా. నిధులు మంజూరు చేయాలని కోరుతున్నా. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఈ విషయం ఆలోచించాలి. అయోధ్య, కుంభమేళాకే కాదు.. మేడారానికి కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఒప్పించి నిధులు తీసుకురావాలి..' అని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ..గతంలో ఈ మహా జాతరను అధికారికంగా నిర్వహించే అవకాశం తనకు ఇవ్వాలని కోరుకున్నానని, అదే మాదిరిగా నా కోరికను తీరుస్తూ ప్రజా ప్రభుత్వం ఏర్పాటై జాతరను అధికారికంగా నిర్వహించడం చాలా సంతోషకరంగా ఉందని అన్నారు.

**మొక్కులు సమర్పించుకున్న సీఎం**

మేడారం సమ్మక్క సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులను దర్శించుకున్న సీఎం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లకు 68 కేజీల నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించుకున్నారు. 2024 ఫిబ్రవరిలో తల్లులను దర్శించుకుని నిలువెత్తు బంగారం సమర్పించుకున్నప్పుడు ముఖ్యమంత్రి బరువు 68 కిలోలు కాగా.. ఇప్పుడు కూడా 68 కిలోలే ఉన్నారు.

**పూజారులు, ఆదివాసీ సంఘాలతో భేటీ**

ఆలయ అభివృద్ధిపై సమీక్ష సందర్భంగా అలయ విస్తరణకు సంబంధించిన ప్రణాళిక, డిజైన్లను పూజారులు, ఆదివాసీ సంఘాలకు అధికారులు వివరించారు. అనంతరం సమావేశంలో పాల్గొన్న ఆలయ పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలు సీఎం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలకు సంబంధించిన పలు అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి ఆదివాసీ సంఘాలు తీసుకువచ్చాయి. వీటిపై స్పందించిన సీఎం..ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలను, విశ్వాసాలను పరిగణనలోకి తీసుకునే ఆలయ అభివృద్ధి ఉంటుందని స్పష్టం చేశారు.

దీంతో ఆలయ విస్తరణ, అభివృద్ధికి పూజారులు, ఆదివాసీ సంఘాల నాయకులు ముక్తకంఠంతో ఆమోదం తెలిపారు. హెలికాప్టర్‌లో వచ్చిన ముఖ్యమంత్రి వెంట మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఉన్నారు. ఆయా కార్యక్రమాల్లో వీరితో పాటు ఎమ్మెల్సీలు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, బాలునాయక్, కడియం శ్రీహరి, మురళీ నాయక్ , రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, కోరం కనకయ్య, జారె ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు.

**ఇక ఒకే వరుసలో గద్దెలు – ఇదీ మాస్టర్‌ప్లాన్..**

సమ్మక్క, సారలమ్మ గద్దెలు ప్రస్తుతం ఒక వరుసలో ఉండగా, వీరి ఎదురుగా పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలు ఉన్నాయి. అయితే భక్తులు క్యూ లైన్ ద్వారా సమ్మక్క–సారలమ్మను దర్శించుకుని పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల వద్దకు రావటం ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలో సమ్మక్క, సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజుల గద్దెలు ఒకే వరుసలో ఉండేలా నిర్మాణానికి వీలుగా కొత్తగా డిజైన్ రూపొందించారు. గద్దెల చుట్టూ ఉన్న ఇనుప గ్రిల్స్ స్థానంలో గ్రానైట్ నిర్మాణం చేపట్టనున్నారు. గ్రానైట్‌పై సమ్మక్క, సారలమ్మ చరిత్రతో పాటు గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలు, వారి లిపి, జాతర వైభవం తెలియజేసే బొమ్మలను చెక్కనున్నారు. అదే విధంగా మహా జాతర వేళ భక్తులకు సమ్మక్క, సారలమ్మ తల్లులు.. పగిడిద్ద రాజు, గోవిందరాజుల దర్శనం కష్టం కాకుండా స్థల సేకరణ ద్వారా గద్దెల ప్రాంగణం విస్తరణను ప్లాన్‌లో చేర్చారు. ఇందుకోసం దేవాదాయ శాఖకు చెందిన 4 ఎకరాలు, ప్రభుత్వ భూమి 19 ఎకరాలు.. మొత్తం 23 ఎకరాలు సేకరిస్తారు. అతిథి గృహాలు నిర్మించాలనే ప్రతిపాదన కూడా ఉంది.



# మావోల రక్షణ దళంలో కోవర్టులు



ఈకబురు, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు పార్టీని కోవర్టుల సమస్య మరోసారి పట్టి పీడిస్తోంది. ఆ పార్టీ అగ్ర నేతల వద్ద పనిచేస్తున్న రక్షణ దళ సభ్యులే కోవర్టులుగా మారుతున్నారు. పార్టీ వ్యూహాలు, నేతల కదలికలకు సంబంధించిన సమాచారాన్ని భద్రతా దళాలకు చేరవేస్తున్నారు. అంతేకాదు ఎన్‌కౌంటర్లకు మార్గనిర్దేశం చేస్తు న్నారు. ఇటీవల జరిగిన వరుస ఘటనలపై మావోయిస్టు పార్టీ స్పందించిన తీరును పరిశీలిస్తే ఈ విషయాలన్నీ వాస్తవమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**నంబాల కన్నుగప్పి...**

మావోయిస్టు పార్టీ సుప్రీం కమాండర్ నంబాల కేశవరావు మే 21న చనిపోయారు. అంతకంటే 4 రోజుల ముందు మే 17న నంబాల రక్షణ దళంలోని ఓ జంట అకస్మాత్తుగా దళాన్ని వీడింది. ఆ వెంటనే మే 19న భద్రతా దళాలు నంబాల బృందం బస చేసిన క్యాంప్‌ను చుట్టుముట్టాయి. అప్పటి నుంచి మే 21వరకు దట్టమైన అడవిలో సుమారు నలభై కిలోమీటర్లకు పైగా నంబాల బృందాన్ని భద్రతా దళాలు దారి తప్పకుండా వెంబడించాయి. నంబాల టీమ్‌ను వీడి వెళ్లిన జంట మావోయిస్టులే భద్రతా దళాలకు నంబాల బృందం జాడను పక్కాగా తెలిపింది. అందుకే ఆపరేషన్‌లో పార్టీ చీఫ్ చనిపోయాడు.

**కర్రిగుట్టల దగ్గర అంతా**

దేశంలోనే అతి పెద్ద యాంటీ నక్సల్ ఆపరేషన్ ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దులోని కర్రిగుట్టల దగ్గర ఏప్రిల్ 21న మొదలైంది. సుమారు 20 వేల మంది బలగాలు 21 రోజుల పాటు ఈ గుట్టలను చుట్టుముట్టాయి. హెలికాప్టర్లు వినియోగించినా ఆశించిన పురోగతి సాధించలేకపోయాయి. ఈ ఆపరేషన్‌పై మావోయిస్టులు స్పందిస్తూ తమ పార్టీకే చెందిన ఓ వ్యక్తి ఆపరేషన్ మొదలైన రెండు వారాలకు పోలీసులకు లొంగిపోవడంతో తమకు స్వల్పంగా నష్టం జరిగిందని వెల్లడించారు. అప్పటి వరకు తమ దగ్గరకు భద్రతా దళాలు చేరుకోలేకపోయా యంటూ సెప్టెంబర్‌లో జారీ చేసిన లేఖలో పేర్కొన్నారు.

**ఉదయ్ విషయంలోనూ..**

అల్లూరి సీతారామరాజు జిల్లాలో జూలైలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల గణేశ్ అలియాస్ ఉదయ్ చనిపోయాడు. ఈ ఎన్‌కౌంటర్ జరగడానికి రెండు వారాల ముందే గాజర్ల టీమ్‌లో కీలకంగా ఉన్న ఇద్దరు మావోయిస్టులు తెలంగాణలో లొంగిపోయారు. గాజర్ల కదలికలకు సంబంధించి కీలక సమాచారం చేరవేశారు.

దీని ఆధారంగా అర్ధరాత్రి వేళ ట్యాబ్‌ను ఓపెన్ చేసి మావోయిస్టు పార్టీకి సంబంధించిన సమాచారాన్ని గాజర్ల ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాడనే విషయం భద్రతా దళాలకు తెలిసింది. దీని ఆధారంగానే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ పక్కాగా ఉదయ్‌ను చుట్టుముట్టడంతో ఆయనతో పాటు మరో కీలక మావోయిస్టు చైతే కూడా చనిపోయింది. దీంతో ఏఓబీలో పార్టీ పెద్ద దిక్కును కోల్పోయినట్టయ్యింది.

**అక్కడా అంతే**

జార్ఖండ్‌లో ఏప్రిల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు ప్రయాగ్ మాంఝీతో పాటు ఇద్దరు డివిజనల్ సభ్యులు, సెప్టెంబర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో సహదేవ్ సోరెన్‌తో పాటు ఇద్దరు డివిజనల్ కమిటీ సభ్యులు చనిపోయారు. ఈ రెండు ఘటనల్లో కేవలం అగ్రనాయకులే చనిపోవడం వెనుక కోవర్టు ఆపరేషన్ జరిగిందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

అంతకు ముందు జూన్‌లో ఇంద్రావతి నేషనల్ పార్కులో కేంద్ర కమిటీ సభ్యులు తెంటు లక్ష్మీనరసింహాచలం అలియాస్ సుధాకర్‌తో పాటు మైలారపు ఆడెల్లు అలియాస్ భాస్కర్ తో పాటు మరో 8మంది మద్దేడు ఏరియా కమిటీ సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారంటూ తెలంగాణలోని పౌర హక్కుల సంఘం నేతలు ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలను పోలీసులు ఖండించారు.

కానీ ఆ తర్వాత వరుసగా 2 రోజుల్లో సుధాకర్, భాస్కర్ ఎన్‌కౌంటర్ అయ్యారు. దీంతో పౌర హక్కుల సంఘం నేతలు చేసిన ఆరోపణలు నిజమేనన్న పరిస్థితి ఏర్పడింది. చలపతి, బాలన్న ఎన్‌కౌంటర్ల విషయంలోనే బలమైన ఆరోపణలు రాలేదు.

# యూరియా కోసం తోపులాట

ఈకబురు,పెద్దవూర: నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని రైతులు యూరియా కోసం మంగళవారం ఉదయం పీఏసీఎస్ వద్దకు అధిక సంఖ్యలో వచ్చి క్యూలో నిల్చున్నారు. ఒకే కౌంటర్ ఉండడంతో ఒకవైపు మహిళలు, మరోవైపు పురుషులు క్యూ కట్టారు. రెండువైపుల నుంచి రైతులు కౌంటర్ వద్దకు ఒకేసారి తోసుకోవడంతో శ్వాస ఆడక ముగ్గురు మహిళా రైతులు సొమ్మసిల్లి పడిపోయారు.

పోలీసులు, వ్యవసాయ సిబ్బంది వారిని పక్కకు తీసుకొచ్చి ముఖంపై నీళ్లు చల్లి సపర్యలు చేయడంతో ఇద్దరు మహిళలు స్పృహలోకి వచ్చి మరలా క్యూలైన్‌లోకి వెళ్లారు. గేమ్యానాయక్‌తండాకు చెందిన లక్ష్మి కొంత ఇబ్బంది పడటంతో 108లో పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ చొరవ తీసుకుని పీఏసీఎస్‌కు పక్కనే ఉన్న పాత సీడీపీఓ కార్యాలయం వద్ద మహిళలకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయించారు.

**రైతుపై చేయిచేసుకున్న హోంగార్డు!**

యూరియా కోసం క్యూలో నిల్చున్న ఓ రైతుపై హోంగార్డు చేయిచేసుకున్నాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో నాగార్జునసాగర్ సీఐ శ్రీనునాయక్ పెద్దవూరకు వచ్చి బాధిత రైతుతో మాట్లాడారు. తనను హోంగార్డు ఏమీ కొట్టలేదని, తాను వేకువజామునే వచ్చి క్యూలో నిల్చున్నట్లు మూత్రం రావడంతో బయటకు వెళ్లి వచ్చానని, తిరిగి క్యూలో నిల్చుండగా ఈ క్రమంలో తన వెనకాల ఉన్న రైతులు గొడవ చేశారని, దీంతో హోంగార్డు వచ్చి తనను బయటకు లాగే ప్రయత్నం చేశాడని, తాను ఉన్న విషయాన్ని చెప్పడంతో వెళ్లిపోయాడని చెప్పాడు.

సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం నెమ్మికల్‌లోని మనగ్రోమోర్ సెంటర్ వద్ద రైతులు యూరియా కోసం పెద్ద సంఖ్యలో బారులు దీరారు.



# దేశంలో అతిపెద్ద సమస్య నిరుద్యోగం: రాహుల్

ఈ-కబురు,ఢిల్లీ: ఎన్నికల్లో ఓట్లచోరీ జరిగినంత కాలం దేశంలో నిరుద్యోగం, అవినీతి పెరుగుతూనే ఉంటాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఇకపై యువత దీన్ని సహించబోదని 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. దేశంలో యువత ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య నిరుద్యోగమేనని, అది నేరుగా ఓట్లచోరీతో ముడిపడి ఉందని ఆరోపించారు. ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుని తాము అధికారంలోకి వచ్చినప్పుడు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే మొదటి కర్తవ్యమని పేర్కొన్నారు. భాజపా నిజాయతీగా ఎన్నికల్లో గెలవట్లేదని, ఓట్లను దొంగిలించి అధికారంలో ఉంటోందని విమర్శించారు. పరీక్ష పత్రాలన్నీ లీక్ కావడంతో నియామకాల్లో అవినీతి పెరిగిపోయిందని, యువత భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆరోపించారు. యువత సమస్యలపై ప్రధాని మోదీ దృష్టి పెట్టకుండా, తన సొంత ప్రచారం, ప్రముఖుల ప్రశంసలు, బిలియనీర్ల లాభాలపైనే శ్రద్ధ చూపుతున్నారని రాహుల్ మండిపడ్డారు.



# హైకోర్టును ఆశ్రయించిన స్మితా సబర్వాల్



ఈ-కబురు, హైదరాబాద్: సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్(Smita Sabharwal) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరిపి జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను నిలిపివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. తనపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ప్రభుత్వానికి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

స్మితా సబర్వాల్ నాడు సీఎం కేసీఆర్(Ex CM KCR) అదనపు కార్యదర్శి హోదాలో పని చేశారు. అయితే కాళేశ్వరం కమిషన్ తనకు సాక్షిగా సమన్లు మాత్రమే జారీ చేసిందని, చట్టప్రకారం ఎలాంటి నోటీసులు ఇవ్వలేదన్నారు. 'కాళేశ్వరం నిర్మాణంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి నేను బాధ్యురాలిని కాను. అప్పటి ముఖ్యమంత్రికి ఫీడ్‌బ్యాక్ ఇచ్చానని. సీఎంవో ప్రత్యేక కార్యదర్శి హోదాలో 3 బరాజ్‌ల నిర్మాణ స్థలాలను కూడా సందర్శించానని కమిషన్ పేర్కొంది.

బరాజ్‌ల నిర్మాణానికి పరిపాలనా అనుమతి, ఆమోదాల మంజూరులో నా పాత్ర ఉందని చెప్పింది. సంబంధిత ఫైళ్లను కేబినెట్ ఆమోదం కోసం ఉంచనందుకు, నిబంధనలను ఉల్లంఘించినందుకు నాపై తీవ్ర చర్యలకు సిఫార్సు చేశారు. కమిషన్ నాపై పక్షపాతంతో పరువు నష్టం కలిగించేలా తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. ఈ నివేదికను రద్దు చేయాలి'అని స్మిత పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ఒకట్రెండు రోజుల్లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్(Justice Aparesh Kumar Singh) ధర్మాసనం విచారణ చేపట్టనుంది.

మొదటి పేజీ తరువాయి

# మాటలే.. చేతల్లేవ్

యుద్ధాలు ఆపా..

'కేవలం 7 నెలల వ్యవధిలోనే ఎప్పటికీ ముగియని యుద్ధాలను ముగించా. అందులో కొన్ని 31 ఏళ్ల నుంచి కొనసాగుతున్నవీ ఉన్నాయి. ఇంకా 36 ఏళ్ల నుంచీ, 28 ఏళ్ల నుంచీ కొనసాగుతున్న యుద్ధాలను ఆపా' అని ట్రంప్ పేర్కొన్నారు. 'ఏడు యుద్ధాలను ఆపా. వీటిలో ఇప్పటిదాకా వేల మంది మరణించారు. కంబోడియాథాయ్‌లాండ్, కొసావోసెర్బియా, కాంగోరువాండా, భారత్‌పాకిస్థాన్, ఇజ్రాయెల్ఇరాన్, ఈజిప్టుఇథియోపియా, ఆర్మేనియాఅజర్‌బైజాన్‌ల మధ్య యుద్ధాలను ఆపేశా' అని వివరించారు.

అమెరికా గొప్ప దేశం

అమెరికా గొప్ప దేశమని, తమ దేశానికి కనీసం దగ్గర్లో కూడా ఏ దేశం లేదని ట్రంప్ గొప్పలుపోయారు. ''వ్యాపారం చేయడానికి ఈ భూగోళంపైనే అత్యుత్తమ దేశం అమెరికా. ప్రస్తుతం అమెరికా ఆర్థిక వ్యవస్థ నా మొదటి హయాం కంటే భారీగా, అత్యుత్తమంగా ఉంది. ఇది చరిత్రలోనే గొప్పగా ఉంది'' అన్నారు.

రష్యా యుద్ధానికి భారత్, చైనాల ఇం'ధనం'

చమురు కొనుగోలు చేయడం ద్వారా ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి భారత్, చైనాలు నిధులు సమకూరుస్తున్నాయని ట్రంప్ విమర్శించారు. 'క్షమించరానిదేమంటే.. నాటో దేశాలు కూడా రష్యా నుంచి ఇంధనాన్ని, ఇంధన ఉత్పత్తులను కొనుగోలు చేయడం తగ్గించలేదు. దీనిపై నేను సంతోషంగా లేను. రష్యా కూడా యుద్ధాన్ని ముగించడానికి సిద్ధంగా లేదు. రక్తపాతం జరుగుతున్న ఈ యుద్ధాన్ని ఆపడానికి మరిన్ని శక్తిమంతమైన సుంకాలను విధించడానికి సిద్ధమవుతున్నాం. అవి త్వరలోనే అమల్లోకి వస్తాయి' అని ట్రంప్ స్పష్టం చేశారు. హమాస్ పాల్పడ్డ దారుణాలకు బహుమతిగా పాశ్చాత్య దేశాలు.. పాలస్తీనాకు గుర్తింపు ఇస్తున్నాయని ట్రంప్ వ్యాఖ్యానించారు.

ఐరాసను తిట్టిన తిట్టుతిట్టకుండా తిట్టిన ట్రంప్.. చివరకు ఆ సంస్థకు 100 శాతం మద్దతుగా నిలుస్తామని ప్రకటించారు.

ఐరోపా దేశాలు నరకంలోకి వెళ్తున్నాయి

'అక్రమ వలసదారులపై కఠిన చర్యలు తీసుకునే విషయంలో అమెరికా ఆదర్శంగా నిలుస్తోంది. నియంత్రణలేని వలసలకు ముగింపు పలికాం. కానీ ఈ విషయంలో ఐరోపా దేశాలు నరకంలోకి వెళ్తున్నాయి. విఫలమైన ఓపెన్ బోర్డర్ల విధానానికి ముగింపు పలకాలి. ప్రమాదాన్ని పసిగట్టడంలో నేను మంచిగానే వ్యవహరించా' అని ట్రంప్ పేర్కొన్నారు. స్వీయ ప్రయోజనాలను వీడండి: ఐరాస

ఐరాస: ప్రపంచ శాంతి, అభివృద్ధి స్థాణువైపోయిన ప్రస్తుత సమయంలో అపరిపక్వ అధికారంపై చట్టపరమైన అధికారం విజయం సాధించే భవిష్యత్తును ఆకాంక్షిస్తూ దేశాలు కలిసికట్టుగా ముందుకు రావాలని, స్వీయ ప్రయోజనాలను వీడాలని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ పిలుపునిచ్చారు. పాలస్తీనాకు గుర్తింపు అనేది పాలస్తీనియన్ల హక్కని, బహుమతి కాదని స్పష్టం చేశారు. ఐరాస సాధారణ సభ సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. 'మనం లక్ష్యం లేని అంతరాయాలతో కూడిన బాధాకరమైన యుగంలోకి ప్రవేశించాం. శాంతి, అభివృద్ధి అనే స్తంభాలు.. శిక్షల్లేకపోవడం, అసమానత్వం, ఉదాసీనత కింద నలిగిపోతున్నాయి' అని గుటెరస్ వ్యాఖ్యానించారు. దేశాధినేతల మొదటి ప్రాధాన్యం శాంతి కావాలని, సూడాన్‌లోని రెబల్ గ్రూపులకు మద్దతు ఇవ్వడం మానుకోవాలని సూచించారు.



# కోర్టు ధిక్కరణపై హైకోర్టుకే వెళ్లండి



దిల్లీ: కానిస్టేబుళ్ల నియామకం కేసులో కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరించిందని... పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుపై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలన్న పిటిషనర్ల అభ్యర్థనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఆ అంశంపై హైకోర్టునే ఆశ్రయించాలని జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. 2023 ఏప్రిల్ 30న జారీచేసిన నోటిఫికేషన్ ప్రకారం 15,644 పోలీస్ కానిస్టేబుళ్ల నియామకం కోసం బోర్డు పరీక్ష నిర్వహించింది. అందులోని 12 ప్రశ్నలపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. వాటిని నిపుణుల కమిటీకి ప్రతిపాదించి దాని సిఫార్సుల ఆధారంగా పరీక్ష ఫలితాలను వెల్లడించి నియామకం చేపట్టాలని 2024 జనవరి 1న హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును సవాల్‌చేస్తూ అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం వివాదాస్పద ప్రశ్నలను నిపుణుల కమిటీకి ప్రతిపాదించి నాలుగు వారాల్లోపు మొత్తం నియామక ప్రక్రియను పూర్తిచేయాలని ఏప్రిల్ 9న ఆదేశాలు జారీచేసింది.

నిపుణుల కమిటీ ఏం చెప్పిందో బహిర్గతం చేయకుండా నియామక ప్రక్రియ పూర్తిచేసిన బోర్డుపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని కోరుతూ అభ్యర్థులు దాఖలుచేసిన పిటిషన్‌పై మంగళవారం విచారించిన జస్టిస్ పీఎస్ నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం తదుపరి విచారణకు నిరాకరించింది. తాము ఇదివరకు హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించాం తప్పితే కొత్తగా ఉత్తర్వులేమీ జారీచేయలేదని, అందువల్ల ఇందులో కోర్టు ధిక్కరణ జరిగిందని భావించేట్లయితే హైకోర్టునే ఆశ్రయించాలని జస్టిస్ పీఎస్ నరసింహ పిటిషనర్లకు సూచించారు. పిటిషనర్ల న్యాయవాది సుయోధన్ వాదనలు వినిపిస్తూ నిపుణుల కమిటీ ఏం చెప్పిందో అభ్యర్థులకు బహిర్గతం చేయకపోతే వారు ఇంతవరకూ చేసిన న్యాయ పోరాటానికి అర్థమే లేకుండాపోతుందని తెలిపారు. 'కోర్టు ఉత్తర్వులపై మీరు ఎందుకు సరైన నిర్ణయం తీసుకోలేకపోయారు? ఏంటి ఇదంతా' అని బోర్డు తరఫున హాజరైన న్యాయవాది రాధాకృష్ణన్‌ను న్యాయమూర్తి ప్రశ్నించారు. నిపుణుల కమిటీ అన్నీ సరిగా ఉన్నాయని మే 4న నివేదిక ఇచ్చిందని ఆయన తెలిపారు. "మరి ఆ విషయాన్ని అభ్యర్థులకు ఎందుకు చెప్పలేదు? మీరు చాలా స్మార్ట్‌గా వ్యవహరించారు. మీ సమాధానం చూస్తే ఆ విషయం తెలుస్తోంది" అని బోర్డు న్యాయవాదిని ఉద్దేశించి న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

# రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి



ఈకబురు,మాస్కో: రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ దాడుల కారణంగా మాస్కో ప్రాంతంలో విమానయానానికి మంగళవారం అంతరాయం ఏర్పడింది. సోమవారం సాయంత్రం నుంచీ మాస్కో పరిసరాల్లో 36 ఉక్రెయిన్ డ్రోన్లను రష్యా బలగాలు గాలిలోనే పేల్చివేశాయని మాస్కో మేయర్ సెర్గీ సోబ్యానిన్‌కు చెందిన పోర్టల్ వెల్లడించింది. నైరుతి మాస్కో ప్రాంతంలోని వార్తాసంస్థ కార్యాలయం వద్ద రెండు భారీ పేలుళ్లు, అనేక చిన్నపాటి పేలుళ్లు వినిపించాయి. ఉక్రెయిన్ డ్రోన్ దాడి నేపథ్యంలో మాస్కోలోని వివిధ విమానాశ్రయాల్లో 200కు పైగా విమానాలు రద్దు కావడమో, ఆలస్యం కావడమో జరిగింది. ర్యుతోవ్ పట్టణంలో ఉక్రెయిన్ డ్రోన్ నాలుగు కార్లను ధ్వంసం చేసింది. రష్యా క్షిపణులు, బాంబులు ఇద్దరు సామాన్యుల ప్రాణాలు బలిగొన్నాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ వెల్లడించారు.

నాటోకు రష్యా హెచ్చరిక

తమ గగనతలాన్ని పరిరక్షించుకునేందుకు తీసుకోదగిన చర్యలన్నీ తీసుకుంటామని నాటో కూటమి రష్యాను హెచ్చరించింది. పోలండ్, ఎస్టోనియాల గగనతల హద్దుల్ని రష్యా ఉల్లంఘించిన నేపథ్యంలో ఈ హెచ్చరిక జారీచేసింది. అలాంటి ఉల్లంఘనలపై తగిన సమయంలో, తగిన పద్ధతిలో చర్యలు చేపడతామని తెలిపింది.

# కొండకల్ శంకర్ గౌడ్ సేవలను శేరిలింగంపల్లి చిరస్థాయిగా గుర్తుంచుకుంటుంది : కొమిరిశెట్టి సాయిబాబా



శంకర్ గౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సాయిబాబా



శంకర్ గౌడ్ వర్ధంతి కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి సాయిబాబా

ఈ-కబురు, శేరిలింగంపల్లి : తెలంగాణ ఉద్యమకారుడు, దివంగత కొండకల్ శంకర్ గౌడ్ సేవలను శేరిలింగంపల్లి ప్రజలు చిరస్థాయిగా గుర్తుంచుకుంటారని బీఆర్ఎస్ శేరిలింగంపల్లి నియోజకవర్గం సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అభిప్రాయపడ్డారు. దివంగత కొండకల్ శంకర్ గౌడ్ 11వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఖాజాగూడలో గల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వర్ధంతి సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొమిరిశెట్టి సాయిబాబా ముఖ్యఅతిథిగా హాజరై శంకర్ గౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సాయిబాబా మాట్లాడుతూ దివంగత కొండకల్ శంకర్ గౌడ్ ను తన రాజకీయ గురువుగా భావిస్తానని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో శంకర్ గౌడ్ ముందుండి పోరాటం చేశారని, శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో అన్ని వర్గాలను సంఘటితం చేస్తూ చేసిన పోరాటం చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుల, కార్యకర్తలు శంకర్ గౌడ్ పోరాటాలను ఆదర్శంగా తీసుకొని మరోసారి ప్రజా సమస్యలపై ఉద్యమించాలని, రానున్న ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరవేయడమే ధ్యేయంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నేడు తెలంగాణ రాష్ట్ర ప్రజలు కేసిఆర్ పాలనను కోరుకుంటున్నారని, ఏ ఎన్నిక జరిగినా బీఆర్ఎస్ పార్టీ అఖండ విజయం సాధించడం ఖాయమన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత కేసిఆర్, మాజీ మంత్రి కేటీఆర్ లకే దక్కుతుందని అన్నారు . ఈ కార్యక్రమంలో అంజమ్మ, ,రమేష్ గౌడ్, శామ్లెట్ శ్రీనివాస్, బాలమణి, తాహెర్ ,మాధవి ,బురాన్ తదితరులు పాల్గొన్నారు.

# బంగాళాఖాతంలో వాయుగుండం..

## 26, 27 తేదీల్లో తెలంగాణలో అతిభారీ వర్షాలు



ఈ-కబురు హైదరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాయుగుండం ప్రభావంతో ఈ నెల 26, 27 తేదీల్లో రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షా లు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. 25న ఏర్పడే అల్పపీడనం 26 నాటికి వాయుగుండంగా బలపడి 27న దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర కోస్తా తీరం వద్ద తీరం దాటే అవకాశాలు ఉన్నట్లు తెలిపింది.

26న ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో పలుచోట్ల 10 నుంచి 20 సెం.మీ. మధ్య వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు పేర్కొంది. 27న ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వానలు కురవనున్నాయి.

# ముంపు ఒప్పందం జరిగితే బ్యారేజ్‌కు అనుమతులు సాధించినట్టా?

ఈకబురు, హైదరాబాద్:బంజారాహిల్స్, న్యూస్‌టుడే: 'ఛత్తీస్‌గఢ్‌తో 50 ఎకరాల ముంపునకు సంబంధించి అంగీకారం కుదిరితేనే సమ్మక్క సాగర్ బ్యారేజ్‌కు అనుమతులు సాధించినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పుకొంటున్నారు. చిన్నదానికే ఇంత ప్రచారం చేసుకుంటే.. ఎన్నో ప్రాజెక్టులను కష్టపడి సాధించిన కేసీఆర్ ఎంత ప్రచారం చేసుకోవాలి?' అని భారత రాష్ట్ర సమితి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రశ్నించారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌లో పలువురు భారత రాష్ట్ర సమితి నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఒకవైపు తుమ్మిడిహెట్టి బ్యారేజ్‌పై మహారాష్ట్రతో చర్చలు జరుపుతామని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారు. కేంద్రం నిధులతో పెన్‌గంగ తదితర నదులపై బ్యారేజీల నిర్మాణానికి మహారాష్ట్ర సిద్ధమవుతోంది. ఇదే జరిగితే తుమ్మిడిహెట్టి వద్ద అనుకున్నంత నీటి లభ్యత ఉండదు. 152 మీటర్లకు తక్కువగా ఆ బ్యారేజ్ నిర్మాణానికి ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోవద్దు' అని సూచించారు.



# జీడీపీ వృద్ధి 6.5 శాతం




**గత అంచనాలు కొనసాగింపు**

**ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ ప్రకటన**

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025–26) భారత జీడీపీ 6.5% వృద్ధి రేటు నమోదు చేస్తుందన్న గత అంచనాలను కొనసాగిస్తున్నట్టు ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ (అంతర్జాతీయ రేటింగ్ సంస్థ) ప్రకటించింది. వర్షా లు సమృద్ధిగా పడడం, ఆదాయపన్ను, జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో దేశీ వినియోగం బలంగా ఉంటుందని పేర్కొంది. ప్రభుత్వ పెట్టుబడులు సైతం పెరుగుతాయని అంచనా వేసింది. ద్రవ్యోల్బణం ప్రస్తుత ఆర్థిక సంత్సరంలో 3.2 శాతానికి పరిమితం అవుతుందని, దీంతో ఆర్‌బీఐ మరో విడత పావు శాతం మేర రెపో రేటును తగ్గించొచ్చని తన తాజా నివేదికలో పేర్కొంది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్) జీడీపీ 7.8 శాతం వృద్ధిని నమోదు చేయడం తెలిసిందే. అంచనాలకు మించి ఆహార ధరలు తగ్గడం.. ప్రస్తుత ఏడాదిలో ద్రవ్యోల్బణం కనిష్ట స్థాయిలోనే కొనసాగేందుకు మద్దతుగా ఉంటుందని తెలిపింది. ఇది తదుపరి రేట్ల కోతకు వెసులుబాటునిస్తుందని అభిప్రాయపడింది. ఆసియా దేశాల ఉత్పత్తులపై అమెరికా టారిఫ్‌లు.. వాటి ఎగుమతులు, ప్రాంతీయ సరఫరా పరిస్థితులపై ప్రభావం చూపిస్తాయని పేర్కొంది. "యూఎస్ టారిఫ్‌లపై జూన్‌లో వేసిన మా అంచనాల తర్వాత పరిణామాలను గమనిస్తే.. ఇప్పటి వరకు ఇతర దేశాల కంటే చైనా మెరుగ్గా వ్యవహరించింది. ఆగ్నేయాసియా అభివృద్ధి మార్కెట్లపై ప్రభావం పడగా, భారత్‌పై ఇది మరింత ఎక్కువగా ఉంది" అని ఎస్అండ్‌పీ వివరించింది.

# యెస్ బ్యాంక్‌లో ఎస్ఎంబీసీకి మరో 4.22% వాటా



దిల్లీ: యెస్ బ్యాంక్‌లో అదనంగా 4.22% వాటాను జపాన్ సంస్థ సుమిటోమో మిత్సుయ్ బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎస్ఎంబీసీ) కొనుగోలు చేసింది. దీంతో యెస్ బ్యాంక్‌లో ఎస్ఎంబీసీ వాటా 20% నుంచి 24.22 శాతానికి చేరింది. ఈనెల 22న ఆఫ్-మార్కెట్ సేల్ ద్వారా 132.39 కోట్ల యెస్‌బ్యాంక్ షేర్లను ఎస్ఎంబీసీ కొనుగోలు చేసినట్లు ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో యెస్ బ్యాంక్ వెల్లడించింది. తాజా లావాదేవీ అనంతరం ఎస్ఎంబీసీ చేతిలో 759.51 కోట్ల యెస్ బ్యాంక్ షేర్లు ఉన్నాయి. గత వారం యెస్ బ్యాంక్‌లో 13.18% వాటాను ఎస్ఎంబీసీకి రూ.8,888.97 కోట్లకు విక్రయించినట్లు ఎస్‌బీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. ఫెడరల్ బ్యాంక్, బంధనబ్యాంక్ సహా ఇంకా పలు బ్యాంకులు కూడా యెస్‌బ్యాంక్ వాటాలను ఎస్ఎంబీసీకి విక్రయించాయి. అనంతరం యెస్‌బ్యాంక్‌లో 4.22% వాటాను కొనుగోలు చేసేందుకు కార్లైల్ గ్రూప్ సంస్థ సీఏ బాస్క్యు ఇన్వెస్ట్‌మెంట్స్‌తో ఎస్ఎంబీసీ ఒప్పందం కుదుర్చుకుంది.

# సీఆర్‌పీఎఫ్ చేతికి సీఎస్ఆర్338 రైఫిల్స్



హైదరాబాద్: కేంద్ర సాయుధ బలగాల సంస్థ సీఆర్‌పీఎఫ్ (సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్)కు సీఎస్ఆర్338 స్నైపర్ రైఫిల్‌స్‌ను మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఎంఈఐఎల్) గ్రూపు సంస్థ ఐకామ్ సరఫరా చేయనుంది. 200 రైఫిల్‌స్‌ను ఈ ఏడాది చివరి కల్లా అందించేందుకు సీఆర్‌పీఎఫ్, ఐకామ్, కారకాల్ మధ్య ఒప్పందం కుదిరింది. భారత్‌యూఏఈ రక్షణ భాగస్వామ్యంలో భాగంగా ఎడ్జ్ గ్రూపు సంస్థ కారకాల్‌తో కలిసి ఐకామ్ హైదరాబాద్‌లో ఆయుధ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. దూరంగా ఉన్న లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించడం సీఎస్ఆర్338 స్నైపర్ ప్రత్యేకత. ఎడమ, కుడి చేతులతో వాడేందుకు వీలుగా మ్యాగజైన్ రిలీజ్, రక్షణ వ్యవస్థ ఉంటాయి. లాపువా మాగ్నమ్ కాలిబర్, బోల్ట్ యాక్షన్ కలిగి ఉంటుంది. 27 అంగుళాల బ్యారెల్, 10 రౌండ్ల మ్యాగజైన్, నాలుగు స్థాయిల్లో సర్దుబాటు చేసుకునే టెలిస్కోప్ వంటి ప్రత్యేకతలున్నాయి. హైదరాబాద్‌లో నైపుణ్యంతో కూడిన ఉద్యోగాలను సృష్టిస్తూ, భారత రక్షణ పారిశ్రామిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఐకామ్ డైరెక్టర్ సుమంత్ పాతూరు చెప్పారు. చిన్న ఆయుధాల సాంకేతిక పరిజ్ఞానం బదిలీలో ఇదొక కీలక ఘట్టం అని కారకాల్ సీఈఓ హమాద్ అలామెరి వెల్లడించారు.

# భారీ నౌకా నిర్మాణ పరిశ్రమకు మౌలిక హోదా

దిల్లీ: భారత్‌లో తయారీని ప్రోత్సహించే చర్యల్లో భాగంగా భారీ నౌకా నిర్మాణ పరిశ్రమకు మౌలిక హోదాను ప్రభుత్వం ఇచ్చింది. భారతీయ యాజమాన్యం, జెండా కింద ఉండే 10,000 టన్నులు లేదా అంతకంటే ఎక్కువ బరువుండే వాణిజ్య నౌకలకు మౌలిక హోదా పొందే అర్హత ఉంటుంది. వాణిజ్య నౌకల నిర్మాణం భారత్‌లోనే జరిగితే మాత్రం 1500 లేదా అంతకంటే ఎక్కువ టన్నులుండి, భారతీయ యాజమాన్యం, జెండా కింద ఉన్నా ఈ హోదా లభిస్తుంది. 'హార్మనైజ్డ్ మాస్టర్ లిస్ట్ ఆఫ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' ఉపరంగాల్లోని రవాణాలాజిస్టిక్స్ విభాగంలో ఈ భారీ నౌకలను చేర్చినట్లు ఆర్థిక శాఖ ఈనెల 19న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొంది.

జరిగే మేలు ఇదీ: సరళతర విదేశీ రుణాలు, పన్ను రహిత బాండ్ల ద్వారా నిధుల సమీకరణ సామర్థ్యం, పన్ను మినహాయింపులు, ఐఐఎఫ్‌సీఎల్, డెట్ ఫండ్‌ల వంటి రుణదాతల నుంచి సులభ రుణలభ్యత వంటి ప్రయోజనాలు ఈ రంగ సంస్థలకు దక్కుతాయి.



# 2026లో ప్రపంచ ఆర్థికం బలహీనమే!



అమెరికా టారిఫ్‌లతో భారత్‌కూ ఇబ్బందులు

డబ్ల్యూఈఎఫ్ తాజా అంచనాలు

దిల్లీ: అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ బలహీన వృద్ధి దశలోకి అడుగుపెడుతోందని ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) తాజాగా విడుదల చేసిన 'చీఫ్ ఎకనమిస్ట్స్ అవుట్‌లుక్'లో పేర్కొంది. 2025లో భారత్ 6.5% వృద్ధిని సాధిస్తుందని అంచనా వేస్తూనే, దేశ తయారీ లక్ష్యాలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్‌లు అడ్డంకిగా మారనున్నాయని అంటోంది. ఈ పరిణామం దక్షిణాసియా మొత్తం మీద ప్రభావం చూపుతుందని తెలిపింది. ఈ సర్వే ప్రకారం.. 2026లో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ బలహీనపడుతుందని 72% మంది ముఖ్య ఆర్థికవేత్తలు అభిప్రాయపడ్డారు. వర్ధమాన దేశాల్లో మధ్యప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికా(మెనా), దక్షిణాసియా, తూర్పు ఆసియా, పసిఫిక్ ప్రాంతాలు వృద్ధికి ప్రధాన చోదకాలుగా నిలవగలవు. చైనా భవిష్యత్తు అంచనాలపై మిశ్రమ స్పందనలు వచ్చాయి. ప్రతిద్రవ్యోల్బణ ఒత్తిళ్లు కొనసాగుతాయన్న అంచనాల మధ్య, 56% మంది మోస్తరు వృద్ధి లభిస్తుందని పేర్కొన్నారు. ఐరోపాలో బలహీన వృద్ధే కనిపిస్తుందని 40%, అమెరికాలో బలహీన, తీవ్ర బలహీన వృద్ధికి ఆస్కారం ఉందని 52% మంది అన్నారు.భారత్‌లో ద్రవ్యోల్బణం బాగా అదుపులోకి రావడంతో, మరింత స్థిరమైన విధానాలకు అవకాశం దక్కనుందని పేర్కొంది. అందువల్ల వడ్డీ రేట్ల కోత జరగొచ్చని సంకేతాలిచ్చింది.

# 'కనక' వర్షం!

**ఏడాదిగా పసిడి నాన్ స్టాప్ ర్యాలీ**

**ఐదేళ్లలో రెట్టింపునకు పైగా పెరుగుదల**

రూ.2 లక్షలకు చేరుతుందని అంచనా

ఆభరణ ప్రియులకే కాదు, ఇన్వెస్టర్లు, చివరికి సెంట్రల్ బ్యాంకులకు సైతం పసిడిపై మక్కువ పెరిగింది. ఫలితంగా ఇటీవలి కాలంలో బంగారం ధరలు ఆకాశమే హద్దు అన్న రీతిలో ఎప్పటికప్పుడు కొత్త రికార్డులను నమోదు చేస్తున్నాయి. ముఖ్యంగా 2025లోనే పసిడి ధర 50 శాతం, వెండి ధర 55 శాతం చొప్పున పెరిగాయి. బంగారం ధర గత డిసెంబర్ చివరికి ఉన్న రూ.78,950 నుంచి చూస్తే 10 గ్రాములపై నికరంగా రూ.39,950 ర్యాలీ చేసింది.

వెండి సైతం కిలోకి నికరంగా రూ.49,900 మేర ఈ ఏడాది పెరిగింది. ఈక్విటీ, డెట్.. ఇలా ఏ ఇతర సాధనంతో పోల్చి చూసినా గడిచిన ఏడాది కాలంలో బంగారం, వెండి ముందు వెలవెలబోయాయి. గత ఐదేళ్లలో ఎంసీఎక్స్ మార్కెట్లో 24క్యారట్ బంగారం 112 శాతం ర్యాలీ చేసింది. 2020 సెప్టెంబర్ 19న రూ.51,169 వద్ద ఉంటే, ఇప్పుడు రూ.1,09,388కి చేరుకుంది.

ఈ ర్యాలీ చూసి మరింత మంది ఇన్వెస్టర్లు బంగారం, వెండిలో పెట్టుబడులకు ముందుకు వస్తుండడం, సెంట్రల్ బ్యాంకులు సైతం డాలర్ స్థానంలో బంగారానికి వెయిటేజీ పెంచడం ధరలకు మరింత ఆజ్యం పోస్తోంది. గత ఏడాది కాలంలో డాలర్‌తో రూపాయి విలువ 83.48 నుంచి 88.73కు (6 శాతానికి పైన) పడిపోయింది. బంగారం దిగుమతులపై ఆధారపడడంతో రూపాయి బలహీనత దేశీయంగా అధిక ధరలకు కారణమవుతోంది.

**పసిడి @ రూ.1,18,900**

ఢిల్లీ మార్కెట్లో పసిడి, వెండి సరికొత్త జీవిత కాల గరిష్ఠాలను నమోదు చేశాయి. సోమవారం 10 గ్రాములకు పసిడి (99.9 శాతం స్వచ్ఛత) రూ.2,200 లాభపడగా, మంగళవారం మరో రూ.2,700 పెరిగి రూ.1,18,900 స్థాయికి చేరింది. డాలర్‌తో రూపాయి బలహీనత నేపథ్యంలో బంగారంలో పెట్టుబడుల డిమాండ్ పెరిగినట్టు ట్రేడర్లు చెబుతున్నారు. ఢిల్లీ మార్కెట్లో వెండి కిలోకి రూ.3,220 పెరిగి రూ.1,39,600 స్థాయిని తాకింది. అంతర్జాతీయంగా చూస్తే కామెక్స్ ఫ్యూచర్స్‌లో పసిడి ఔన్స్‌కు 36 డాలర్ల వరకు పెరిగి 3,811 డాలర్లకు చేరుకుంది.

**టార్గెట్ 2 లక్షలు!**

వచ్చే ఏడాది కాలంలో బంగారం ధరలు 15-20 శాతం మేర పెరగొచ్చని త్రివేష్ అంచనా వేశారు. "ఫెడ్ వడ్డీ రేట్ల కోతను కొనసాగిస్తే, డాలర్ బలహీన పడుతుంది. ఇది బంగారం ధరలు పెరిగేందుకు మద్దతునిస్తుంది"అని పేర్కొన్నారు. తక్కువ వడ్డీ రేట్లు ఎక్కువ కాలం కొనసాగితే, ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడులకు డిమాండ్ సంస్థాగతంగా కొనసాగుతుందని, అటువంటి పరిస్థితుల్లో వచ్చే ఐదేళ్లలో 10 గ్రాముల పసిడి ధర రూ.1.7 లక్షలకు చేరుకోవచ్చని మనీష్ శర్మ అంచనా వేశారు.

2026 మధ్య నాటికి అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారం ధర 4,000 డాలర్లను అధిగమించొచ్చన్నారు. 2-5 ఏళ్లలో 5,000 డాలర్లకు వెళ్లొచ్చని (రూ.1,50,000-1,70,000) చెప్పారు. జెఫరీస్ ఈక్విటీ స్ట్రాటజీ గ్లోబల్ హెడ్ క్రిస్టోఫర్ ఉడ్ సైతం బంగారం ధరలు ఇక్కడి నుంచి మరింత పెరగొచ్చని అభిప్రాయపడ్డారు. రానున్న కాలంలో ఔన్స్‌కు 6,600 డాలర్లకు చేరుకోవచ్చని (ఇక్కడి నుంచి 70 %కి పైన, అంటే మన దగ్గర రూ. 2 లక్షలు) అంచనా వేశారు.

**అంతర్జాతీయ అనిశ్చితుల ఆజ్యం..**

కరోనా విపత్తు నుంచి పుత్తడి ధరల పెరుగుదల మొదలైంది. ఆ తర్వాత ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం మొదలు పెట్టడం, మధ్యప్రాచ్యంలో ఇజ్రాయెల్-పాలస్తీనా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఇవన్నీ భౌగోళికంగా అనిశ్చితులను రాజేశాయి. గతేడాది రెండో పర్యాయం అమెరికా అధ్యక్ష పీఠమెక్కిన డోనాల్డ్ ట్రంప్ సుంకాల పోరుకు తెరతీయడం విలువైన లోహాలకు డిమాండ్‌ను మరింత పెంచింది. సంప్రదాయ డెట్, ఈక్విటీల స్థానంలో ఇన్వెస్టర్లు సురక్షిత సాధనమైన బంగారంలోకి పెట్టుబడులను పెంచుతూ రావడం ధరలకు మద్దతుగా నిలుస్తోంది.

అమెరికా రుణ భారం భారీగా పెరిగిపోయిన తరుణంలో డాలర్‌కు బదులు సెంట్రల్ బ్యాంకుల బంగారం కొనుగోళ్లకు ప్రాధాన్యం ఇస్తుండడంతో పసిడి ధరలు దిగొస్తాయన్న అంచనాలు తలకిందులవుతున్నాయి. గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడులు ధరలకు ప్రేరణనిస్తున్నట్టు ఆనంద్‌రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్ కమోడిటీ విభాగం ఏవీపీ మనీష్ శర్మ చెప్పారు. '2005లో 24క్యారట్ బంగారం ధర (10 గ్రాములు) రూ.7,000 వద్ద ఉంది. 2010 నాటికి రూ.18,500కు పెరిగింది. 2015లో రూ.26,300 వద్ద ఉంది. 2025 సెప్టెంబర్‌లో రూ.1,18,000కు చేరుకుంది. ఈ ఏడాది ఆగస్ట్‌లో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి పెట్టుబడులు 36 శాతం పెరిగాయి. ఈ ట్రాక్ రికార్డును పరిశీలిస్తే దీర్ఘకాలంలో బంగారం బలంగా నిలబడుతుంది' అని చెప్పారు. యూఎస్‌లో లిస్టెడ్ గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడులు 215 బిలియన్ డాలర్లకు చేరినట్టు శర్మ తెలిపారు.



# సమాజాన్ని.. దేశాన్ని మేల్కొలిపే శక్తిమంతమైన మాధ్యమం సినిమా



రాష్ట్రపతి మాట్లాడుతూ.. సినిమా రంగంలో మహిళా దర్శకుల సంఖ్య తక్కువగా ఉండటాన్ని ప్రస్తావించారు. విద్యా రంగంలో విద్యార్థినులు జైత్రయాత్ర సాగిస్తున్నట్లే.. చలన చిత్ర అవార్డుల్లోనూ మహిళలు సత్తా చాటే ప్రయత్నం చేయాలన్నారు. దీని కోసం సినీ రంగంలోనూ ఆడవాళ్లకు సమాన అవకాశాలు కల్పించాలన్నారు. జ్యూరీ ప్యానెల్‌లోనూ వాళ్లకు తగిన ప్రాతినిధ్యం ఉండాలని సూచించారు. "ఈరోజు అవార్డులు గెలుచుకున్న చిత్రాల్లో తల్లులు తమ పిల్లలకు నైతిక విలువల్ని నేర్పించే కథలు, సామాజిక నిషేధాల్ని ఎదురించే ధైర్యవంతమైన మహిళల కథలు, పురుషాధిక్యతకు వ్యతిరేకంగా గొంతు విప్పే కథలు ఉన్నాయి. ఇది సమాజానికి ఒక గొప్ప సందేశం" అని ద్రౌపదీ ముర్ము చెప్పారు.

అనంతరం దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత మోహన్‌లాల్‌తో పాటు జాతీయ పురస్కార విజేతలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. "మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా సినిమా పరిశ్రమలో ఉపయోగించే కెమెరాలు, ఇతర పరికరాల్ని భారత దేశంలోనే తయారు చేయాల"ని పిలుపునిచ్చారు. ఈ వేడుకలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజుతో పాటు జ్యూరీ సభ్యులు అశుతోష్ గోవారికర్, గోపాలకృష్ణ పాయ్, పి.శేషాద్రి పాల్గొన్నారు.

**ఫాల్కే అవార్డును కలలో కూడా ఊహించలేదు**

"ఈ వేదికపై రాష్ట్రపతి చేతుల మీదుగా దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు అందుకోవడం ఎంతో గౌరవంగా.. చాలా గర్వంగా ఉంది. దీన్ని నేను కలలో కూడా ఊహించలేదు. ఇదంతా ఓ మ్యాజిక్‌లా ఉంది. ఇది కేవలం నా ఒక్కడిదే కాదు.. మొత్తం మలయాళ చిత్ర పరిశ్రమకు దక్కిన పురస్కారమిది. దాని గొప్ప చరిత్రకు, సృజనాత్మకతకు, ప్రతిభకు, ధైర్యానికి ఈ అవార్డు అంకితం. ఈ గౌరవం మలయాళ చిత్రసీమకు ఓ మైలురాయిలా నిలిచిపోతుంది. నాకీ పురస్కారాన్ని అందించినందుకు భారత ప్రభుత్వానికి, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, జ్యూరీ సభ్యులకు కృతజ్ఞతలు. ఈ అవార్డు నాకొక గౌరవం మాత్రమే కాదు.. నాపై మరింత బాధ్యతను పెంచుతోంది".

మోహన్‌లాల్

## 7వేల స్క్రీన్లలో 'కాంతార: చాప్టర్1'.. పోస్టల్ స్పెషల్ కవర్..



ప్రాంతీయ చిత్రంగా విడుదలై పాన్ ఇండియా స్థాయిలో రికార్డులు సృష్టించింది 'కాంతార'. ఇప్పుడు ఆ మూవీకి ప్రీక్వెల్‌గా 'కాంతార:చాప్టర్1' రాబోతోంది. ఇప్పటికే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ దసరా కానుకగా అక్టోబరు 2న (kantara ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రీక్వెల్‌పై భారీ అంచనాలు ఉన్న నేపథ్యంలో చిత్ర నిర్మాణ సంస్థ కూడా అంతే స్థాయిలో సినిమాను ప్రేక్షకులకు చేరువ చేసేందుకు సిద్ధమైంది. దేశవ్యాప్తంగా 7వేలకు పైగా స్క్రీన్‌లలో 'కాంతార: చాప్టర్1'ను విడుదల చేయనుంది. కన్నడ, తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషలతో పాటు, అంతర్జాతీయ ఇంగ్లీష్ వెర్షన్‌ను కూడా సిద్ధం చేసింది. దక్షిణ అమెరికాలో ఫస్ట్ పార్ట్‌కు ఆదరణ దక్కడంతో ఇప్పుడు ప్రీక్వెల్‌ను స్పానిష్‌లో డబ్ చేసి విడుదల చేస్తున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన పనులు కూడా పూర్తయ్యాయి.

**ప్రచార కార్యక్రమాలు ముమ్మరం**

విడుదలకు సుమారు 10 రోజుల సమయం ఉండటంతో ప్రచార కార్యక్రమాలు పక్కాగా నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ప్రస్తుతం రిషబ్‌శెట్టి పోస్ట్ ప్రొడక్షన్‌పనుల్లో బిజీగా ఉన్నారు. సంగీత దర్శకుడు అజనీష్ లోకనాథ్ నేపథ్య సంగీతానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. అక్టోబరు 27న కోచి, ఆ తర్వాత చెన్నై, అటు నుంచి హైదరాబాద్‌లో చిత్ర బృందం పర్యటించనుంది. సెప్టెంబరు 29 నుంచి 30 వరకూ ఉత్తర భారతంలో ప్రెస్ టూర్ నిర్వహించనున్నారు.

**భూటాన్ లగ్జరీకార్ల స్మగ్లింగ్.. దొరక్కపోతే అందరూ 'లక్కీ భాస్కర్లే'**

**పోస్టల్ స్పెషల్ కవర్..**

మరోవైపు కర్ణాటక పోస్టల్ సర్కిల్ భాగస్వామ్యంతో 'కాంతార'థీమ్‌తో చిత్ర బృందం స్పెషల్ కవర్‌ను తీసుకొచ్చింది. కన్నడ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబిచేలా తీర్చిదిద్దిన కవర్ ఆకట్టుకుంటోంది. ఇది కన్నడ సంప్రదాయానికి దక్కిన అరుదైన గౌరవమని పేర్కొంది. 'స్పిరిట్ ఆఫ్ కర్ణాటకలో భాగంగా భూతకోల నేపథ్యంలో రెండు పోస్టల్ కార్డులను అందుబాటులోకి తెచ్చాం. ఇది ఆధ్యాత్మికతను, జానపదాన్ని, సంస్కృతిని ఏకం చేస్తుంది. హోంబాలే ఫిల్మ్స్ సహకారంతో కర్ణాటక పోస్ట్ సర్కిల్ ఈ కార్డులను విడుదల చేసింది. కాంతార ద్వారా సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచ ప్రేక్షకులకు తెలియజేస్తుంది. ఈ కథలన్నీ రాబోయే తరాలకు స్ఫూర్తిని ఇస్తాయి' అని ఇండియా పోస్ట్ పేర్కొంది

## సందీప్ వంగా చిత్రంలో అనంతిక!

అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు సందీప్ రెడ్డి వంగా. త్వరలో ఆయన ప్రభాస్‌తో 'స్పిరిట్' సినిమాని పట్టాలెక్కించేందుకు సమాయత్తమవుతున్నారు. అయితే మరోవైపు ఆయన నిర్మాతగానూ ఓ చిన్న సినిమాకి శ్రీకారం చుట్టే ప్రయత్నాల్లో ఉన్నారు. తన సొంత నిర్మాణ సంస్థ భద్రకాళి పిక్చర్స్‌పై రూపొందనున్న ఆ ప్రాజెక్ట్‌తో వేణు అనే కొత్త దర్శకుడు తెరకు పరిచయం కానున్నట్లు తెలుస్తోంది. నాయికగా '8 వసంతాలు' ఫేమ్ అనంతిక సనీల్ కుమార్ ఖరారైనట్లు సమాచారం. ఇది తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో సాగే ప్రేమకథగా ఉండనుందని.. హీరోగా 'మేం ఫేమస్' ఫేమ్ సుమంత్ ప్రభాస్ కనిపించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.



## దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం అందుకున్న మోహన్‌లాల్



ఈ-కబురు, 'హైదరాబాద్: ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం 71వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. విజేతలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అవార్డులతో పాటు ప్రశంసాప్రత్రాలను అందజేశారు. ప్రముఖ మలయాళ నటుడు మోహన్‌లాల్ ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం అందుకున్నారు. 'జవాన్' చిత్రానికి షారుక్ ఖాన్, 'ట్వల్త్ ఫెయిల్'కు విక్రాంత్ మాస్సే ఉత్తమ నటులుగా, ఉత్తమ నటిగా రాణీ ముఖర్జీ (మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే) పురస్కారాలు స్వీకరించారు. ఉత్తమ ఏవీజీసీ విభాగంలో 'హను-మాన్'కి దర్శకుడు ప్రశాంత్ వర్మ, నిర్మాత నిరంజన్‌రెడ్డి, యానిమేటర్ అండ్ సూపర్‌వైజర్ వెంకట్‌కుమార్ జెట్టీ అవార్డులు అందుకున్నారు.

ఉత్తమ తెలుగు ప్రాంతీయ చిత్రంగా నిలిచిన 'భగవంత్ కేసరి'కి దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటి, 'బేబి' చిత్రానికి ఉత్తమ నేపథ్య గాయకుడిగా పీవీఎన్ఎస్ రోహిత్, ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగా సాయి రాజేశ్ నీలం పురస్కారాలు స్వీకరించారు. ఉత్తమ గేయ రచయితగా కాసర్ల శ్యామ్‌కుమార్ (బలగం.. 'ఊరు పల్లెటూరు'), ఉత్తమ స్టంట్ కొరియోగ్రాఫర్లుగా పృథ్వి - కన్నన్ నందురాజ్ (హను-మాన్), ఉత్తమ బాల నటిగా ప్రముఖ దర్శకుడు సుకుమార్ కుమార్తె సుకృతి వేణి (గాంధీ తాత చెట్టు), నాన్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో ఉత్తమ లఘు చిత్రం 'గిద్ధ్ ది స్కావెంజర్' (హిందీ)కి నిర్మాత రాధిక లావు అవార్డులు అందుకున్నారు.

**పురస్కార గ్రహీతలకు కిషన్‌రెడ్డి అభినందనలు**

ఈ-కబురు, హైదరాబాద్: 71వ జాతీయ చలన చిత్రోత్సవాల్లో పురస్కారాలు పొందిన చలన చిత్ర బృందాలు, నటులకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్న ఉత్తమ తెలుగు చిత్రంగా భగవంత్ కేసరి బృందానికి, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలో ఉత్తమ చిత్రంగా హనుమాన్ చిత్ర బృందానికి, బలగం ఉత్తమ గీత రచయిత కాసర్ల శ్యాం తదితరులకు కిషన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

## నువ్వుంటే నా చెంత.. లేదు ఏ చింత



ఈకబురు, జాన్వీ కపూర్, వరుణ్ ధావన్ జంటగా తెరకెక్కిన చిత్రం 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి'. శశాంక్ ఖైతాన్ దర్శకత్వం వహిస్తున్నారు. ధర్మ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం దసరా సందర్భంగా అక్టోబరు 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం తాజాగా ఈ సినిమా నుంచి "తూ హై మేరీ" అనే ప్రత్యేక ప్రేమ గీతాన్ని విడుదల చేసింది. ఇందులో "నా ప్రేమను ఎలా దాచగలను..నిన్ను నా ప్రేయసిని చేసుకోవాలనుకుంటున్నాను. నేను ఊపిరి తీసుకున్నప్పటికీ.. నిన్ను చూసినప్పుడు మాత్రమే బతికున్నాననిపిస్తుంది. నువ్వు నా చెంత ఉండడంతో నాకు ఎలాంటి చింత లేదు.. నువ్వు చంద్రుడివి కావు కానీ నా హృదయాన్ని వీడని అనుబంధానివి" అంటూ సాగుతున్న ఈ పాట జాన్వీ, వరుణ్‌ల భావోద్వేగ సన్నివేశాలతో ప్రేక్షకుల్ని ఆకట్టుకుటోంది. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ చిత్రంలో సన్యా మల్హోత్రా, రోహిత్ సరాఫ్, అక్షయ్ ఒబెరాయ్ తదితరులు కీలక పాత్రలలో నటిస్తున్నారు.

# డికీ బర్డ్ కన్నుమూత



లండన్: దిగ్గజ అంపైర్ డికీ బర్డ్ ఇకలేరు. అంతర్జాతీయ క్రికెట్‌కు విశిష్ఠ సేవలు అందించిన డికీ బర్డ్ తుదిశ్వాస విడిచినట్లు యార్క్‌షైర్ కౌంటీ క్రికెట్ క్లబ్ మంగళవారం ప్రకటించింది. "క్రికెట్‌కు అత్యంత ఇష్టమైన వ్యక్తుల్లో ఒకరైన హెరాల్డ్ డెన్నిస్ డికీ బర్డ్ 92 ఏళ్ల వయసులో తన ఇంట్లో ప్రశాంతంగా కన్నుమూశారు. తరతరాల అభిమాన గణాన్ని విడిచివెళ్లారు" అని యార్క్‌షైర్ కౌంటీ క్లబ్ పేర్కొంది. 1973 నుంచి 1996 వరకు 66 టెస్టులు, 69 వన్డేల్లో ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. చివరగా 1996 లార్డ్స్ టెస్టులో అంపైర్‌గా వ్యవహరించారు. భారత మాజీ సారథులు రాహుల్ ద్రవిడ్, సౌరభ్ గంగూలీ ఈ మ్యాచ్‌లోనే అరంగేట్రం చేశారు.

యార్క్‌షైర్ తరఫున బర్డ్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడారు. 1956 నుంచి 1964 వరకు 93 మ్యాచ్‌ల్లో 3,314 పరుగులు సాధించారు. మైదానంలో ప్రేక్షకులు, క్రికెటర్లతో బర్డ్ ఎప్పుడూ సరదాగా ఉండేవారు. క్రికెట్ ప్రపంచంలో మంచి పేరు తెచ్చుకున్న బర్డ్ వివాహం చేసుకోలేదు. ఎలిజబెత్ రాణి, రచయిత స్టీఫెన్ కింగ్, ఇంగ్లాండ్ ప్రధానమంత్రి జాన్ మేజర్ వంటి ఎంతో మంది స్నేహితులను ఆయన సంపాదించుకున్నారు. మై ఆటోబయోగ్రఫీ విత్ కీత్ లాడ్జ్, ది వైట్ క్యాప్ అండ్ బెయిల్స్ పుస్తకాలను బర్డ్ రచించారు.

**బర్డ్‌కు ఆటగాళ్ల ఉద్రిక్తతలు, ఒత్తిళ్లు తెలుసు... సునీల్ గావస్కర్**

"బర్డ్ మృతి వార్త విచారకరం. విశిష్టమైన వ్యక్తిత్వం కలిగిన బర్డ్‌ను క్రికెట్ ప్రపంచం కోల్పోయింది. ఫస్ట్‌క్లాస్ స్థాయిలో క్రికెట్ ఆడిన ఆయనకు ఆటగాళ్లు ఎలాంటి ఉద్రిక్తతలు, ఒత్తిళ్లకు గురవుతారో బాగా తెలుసు. తన నిర్ణయాలు వ్యతిరేకంగా వచ్చిన సందర్భాల్లో ఆటగాళ్లు నిరాశకు గురైతే సానుభూతి వ్యక్తం చేసేవారు. ఓవర్లు, బంతుల మధ్య మాట్లాడేందుకు సిద్ధంగా ఉండటాన్ని ఆటగాళ్లు ఇష్టపడేవాళ్లు. అయనో అద్భుతమైన అంపైర్. బర్డ్ ఆత్మకు శాంతి చేకూరాలి"

# శ్రీలంకపై పాక్ విజయం




ఆసియాకప్

అబుదాబి: ఆసియాకప్‌లో తన ఫైనల్ అవకాశాలను పాకిస్థాన్ సజీవంగా ఉంచుకుంది. మంగళవారం ఆసక్తికరంగా సాగిన స్వల్ప స్కోర్ల మ్యాచ్‌లో ఆ జట్టు 5 వికెట్ల తేడాతో శ్రీలంకపై గెలిచింది. మొదట శ్రీలంక 8 వికెట్ల నష్టానికి 133 పరుగులే చేయగలిగింది. షహీన్ షా అఫ్రిది (3/28), రవూఫ్ (2/37), హుస్సేన్ తలాత్ (2/18) ఆ జట్టును దెబ్బతీశారు. కమిందు మెండిస్ (50; 44 బంతుల్లో 3×4, 2×6) పోరాడకుంటే శ్రీలంక ఆ మాత్రం స్కోరైనా చేయగలిగేది కాదు. ఓ దశలో 58 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన ఆ జట్టును కమిందు ఆదుకున్నాడు. లక్ష్యాన్ని పాకిస్థాన్ 18 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. నవాజ్ (38 నాటౌట్; 24 బంతుల్లో 3×4, 3×6), తలాత్ (32 నాటౌట్; 30 బంతుల్లో 4×4) కీలక ఇన్నింగ్స్ ఆడారు. స్వల్ప ఛేదనలో పాకిస్థాన్ చెమటోడ్చింది. తీక్షణ (2/24) విజృంభించడంతో ఓ దశలో 57 పరుగులకే 4 వికెట్లు చేజార్చుకుని ఇబ్బందుల్లో పడింది. ఆ దశలో తలాత్ నిలిచాడు. హారిస్ (13) తో అయిదో వికెట్‌కు 23 పరుగులు జోడించిన అతడు.. నవాజ్‌తో అభేద్యమైన ఆరో వికెట్‌కు 58 (41 బంతుల్లో) పరుగుల భాగస్వామ్యంతో పాక్‌కు విజయాన్నందించాడు. సూపర్ 4లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిన లంక.. తన ఫైనల్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. ఆ జట్టు చివరి మ్యాచ్‌లో శుక్రవారం భారత్‌తో తలపడుతుంది. సూపర్ 4లో అది ఆఖరి మ్యాచ్. ఆ పోరుకు ముందే ఫైనల్‌పై స్పష్టత వచ్చే అవకాశముంది.

శ్రీలంక కట్టడి: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక.. షహీన్ అఫ్రిది ధాటికి 18 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత ఏ దశలోనూ పెద్దగా కోలుకోలేకపోయింది. కెప్టెన్ అసలంక (20), కుశాల్ పెరీరా (15) ఇన్నింగ్స్‌ను కాస్త చక్కదిద్దారు. కానీ భాగస్వామ్యం బలపడుతున్న దశలో పెరీరాను రవూఫ్ ఔట్ చేశాడు. కాసేపటి తర్వాత అసలంక, శానక (0)ను తలాత్ వరుస బంతుల్లో ఔట్ చేయడంతో శ్రీలంక 58/5తో కష్టాల్లో పడింది. ఆ దశలో కమిందు మెండిస్ ఆ జట్టును ఆదుకున్నాడు. హసరంగ (15), కరుణరత్నె (17 నాటౌట్)ల సహకారంతో లంకకు పోరాడేందుకు కాస్తయినా అవకాశమున్న స్కోరును అందించాడు. చిన్న లక్ష్యాన్నే నిర్దేశించినా.. ఛేదనలో బౌలర్లు లంకకు ఆశలు కల్పించారు. పాక్ 57/4తో ఉన్నప్పుడు లంక కూడా బలంగానే పోటీలో ఉంది. అయితే తలాత్ ఒత్తిడిలో చక్కని ఇన్నింగ్స్ ఆడాడు. అతడికి నవాజ్ తోడుగా నిలవడంతో పాక్ విజయ తీరాలకు చేరింది. సంక్షిప్త స్కోర్లు... శ్రీలంక ఇన్నింగ్స్: 133/8 (కమిందు మెండిస్ 50, అసలంక 20, కరుణరత్నె 17 నాటౌట్; కుశాల్ పెరీరా 15; హసరంగ 15; షహీన్ అఫ్రిది 3/28, రవూఫ్ 2/37, తలాత్ 2/18)

పాకిస్థాన్: 18 ఓవర్లలో 5 వికెట్లకు 138 (మహ్మద్ నవాజ్ 38 నాటౌట్, హుస్సేన్ తలాత్ 32 నాటౌట్; ఫర్హాన్ 24; తీక్షణ 2/24, హసరంగ 2/27, చమీర 1/31)

# భారత్‌కు ఎదురుందా?

ఆడిన అన్ని మ్యాచ్‌ల్లోనూ గెలిచింది. అన్ని విభాగాల్లోనూ బలంగా కనిపిస్తోంది. టైటిల్ ఫేవరెట్‌గా దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో మరో సమరానికి సిద్ధమైంది టీమ్‌ఇండియా. నేడు బంగ్లాదేశ్‌తో తలపడనుంది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడించడం, సూపర్ ఫామ్ ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తుంటే మరో పంచ్ బలంగా విసరాలని సూర్యకుమార్ బృందం తహతహలాడుతోంది. మరోవైపు సూపర్ 4 తొలి గేమ్‌లో శ్రీలంకకు షాకిచ్చిన బంగ్లా.. ఆ ప్రదర్శనను పునరావృతం చేయాలని ఆశిస్తోంది. పాకిస్థాన్‌తో భారత్ ఆడిన రెండు మ్యాచ్‌లూ హోరాహోరీగా ఏమీ జరగలేదు. సూర్య బృందం పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. కానీ ఆటగాళ్ల మాటల యుద్ధంతో ఆ సమరాలు తీవ్రతతో సాగాయి. ఇప్పుడు బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లోనూ టీమ్‌ఇండియా తిరుగులేని ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నా.. మ్యాచ్ తీవ్రతతో సాగడం ఖాయం. చాలా మంది బంగ్లా యువ అభిమానులు భారత్‌ను విరోధిగా భావించడం, షేక్ హసీనా పదవీచ్యుతురాలైన అనంతరం రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు దెబ్బ తినడం ఇందుకు కారణాలు. ఈ ఏడాది ఆగస్టులో బంగ్లాదేశ్‌తో జరగాల్సిన వైట్‌బాల్ సిరీస్‌ను బీసీసీఐ వాయిదా వేసింది కూడా. బలాబలాలు చూస్తే భారత్‌కు బంగ్లాదేశ్ ఏమాత్రం పోటీకాకున్నా.. ఈ పరిణామాలు మ్యాచ్‌ను ఆసక్తికరంగా మారుస్తున్నాయి. అయితే 2024 ఆరంభం నుంచి 32 టీ20ల్లో గెలిచి, కేవలం మూడు మాత్రమే ఓడిపోయిన టీమ్‌ఇండియాను నిలువరించడం బంగ్లాకు చాలా కష్టమైన పనే. అయితే పిచ్ మందకొడిగా ఉన్న నేపథ్యంలో జట్టులో కాస్త మెరుగైన స్పిన్నర్లున్న బంగ్లాదేశ్‌ను తీసిపారేయలేం

జోరుమీదున్నారు..: వరుస విజయాలతో జోరుమీదున్న టీమ్‌ఇండియా ఉత్సాహంగా బరిలోకి దిగుతోంది. సామర్థ్యానికి తగినట్లు ఆడితే మరో ఘనవిజయం ఖాయం. భారత్ బ్యాటింగ్ విభాగం బలంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఓపెనర్ అభిషేక్ శర్మ ఫామ్ గొప్ప సానుకూలాంశం. భారీ షాట్లతో విరుచుకుపడుతున్న అతడు ఇప్పటికే 200పై స్ట్రైక్‌రేట్‌తో 173 పరుగులు చేసి టోర్నీ టాప్ స్కోరర్‌గా ఉన్నాడు. గత మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై అతడు చెలరేగిన తీరు బంగ్లాకు పెద్ద హెచ్చరికే. మరో ఓపెనర్ శుభ్‌మన్ గిల్ కూడా పాక్‌పై అదరగొట్టాడు. టోర్నీలో అతడి స్ట్రైక్‌రేట్ దాదాపు 158. ఆ తర్వాత తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, సంజు శాంసన్, దూబె, హార్దిక్‌లతో బ్యాటింగ్ లైనప్ దుర్భేద్యంగా కనిపిస్తోంది.

భారత మిడిల్ ఆర్డర్ బ్యాటర్లకు ఈ సిరీస్‌లో బ్యాటింగ్ చేసేందుకు పెద్దగా అవకాశాలు రాలేదు. స్లో పిచ్‌లపై మరింత ప్రభావవంతంగా బౌలింగ్ చేసే ఫాస్ట్‌బౌలర్ ముస్తాఫిజుర్ నుంచి వాళ్లకు పరీక్ష తప్పదు. శ్రీలంకపై అతడు 20 పరుగులే ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. శాంసన్ మిడిల్ ఆర్డర్‌లో కుదురుకోవాలని భారత జట్టు మేనేజ్‌మెంట్ కోరుకుంటోంది. పాకిస్థాన్‌పై సాధికారికంగా ఆడలేకపోయిన అతడు.. 17 బంతుల్లో 13 పరుగులే చేశాడు. తుది జట్టులో భారత్ ఎలాంటి మార్పులు చేసే అవకాశం లేదు. పాక్‌పై ఆడిన జట్టే ఆడుతుంది. కానీ ప్రధాన ఫాస్ట్‌బౌలర్ బుమ్రా ఫామ్‌ను అందుకోవాల్సివుంది. పాకిస్థాన్‌పై దూబె బంతితో రాణించడం భారత్‌కు సంతోషాన్నిచ్చే విషయమే. స్పిన్నర్లు వరుణ్, కుల్‌దీప్, అక్షర్‌లను ఎదుర్కోవడం బంగ్లా బ్యాటర్లకు పెద్ద సవాలే.

బంగ్లాదేశ్ పోటీ ఇస్తుందా?: బంగ్లాదేశ్‌కు బ్యాటింగ్ పెద్ద సమస్యే. ఆ జట్టు బ్యాటర్లలో దూకుడు లోపించింది. భారత బౌలర్లపై ఆధిపత్యాన్ని ప్రదర్శించడం కష్టమే. బంగ్లా జట్టులోని ఇద్దరు ఉత్తమ టీ20 బ్యాటర్లు లిటన్ దాస్ (129పై స్ట్రైక్‌రేట్), హృదోయ్ (124పైన) వేగంగా ఆడలేకపోతున్నారు. అయితే బంతితో ఆ జట్టు కాస్త మెరుగ్గానే ఉంది. స్లో పిచ్‌పై ముస్తాఫిజుర్, స్పిన్నర్లు రిషాద్, మెహదీ హసన్ రాణిస్తే టీమ్‌ఇండియాను కట్టడి చేయొచ్చని బంగ్లా ఆశిస్తోంది. తుది జట్లు (అంచనా)... భారత్: అభిషేక్ శర్మ, గిల్, తిలక్ వర్మ, సూర్యకుమార్, సంజు శాంసన్, దూబె, హార్దిక్, అక్షర్, కుల్‌దీప్, బుమ్రా, వరుణ్ చక్రవర్తి

బంగ్లాదేశ్: సైఫ్ హసన్, తంజిద్ హసన్, లిటన్ దాస్, హృదోయ్, షమిమ్, జేకర్ అలీ, మెహదీ హసన్, నసుమ్ అహ్మద్, తస్కిన్ అహ్మద్, తంజిమ్ హసన్, ముస్తాఫిజుర్

**పిచ్**


ఇక్కడ పిచ్‌లు మందకొడిగా ఉంటున్నాయి. మధ్య ఓవర్లలో పరుగులు చేయడం కష్టమవుతోంది. ఈ మ్యాచ్‌కు కూడా పరిస్థితి భిన్నంగా ఉండకపోవచ్చు. స్పిన్నర్లు కీలక పాత్ర పోషించే అవకాశముంది.

**16**

టీ20ల్లో బంగ్లాదేశ్‌పై భారత్‌ది తిరుగులేని ఆధిపత్యం. ఈ ఫార్మాట్లో ఆ జట్టుతో ఆడిన 17 మ్యాచ్‌ల్లో 16 గెలిచిన టీమ్‌ఇండియా.. ఒక్కటి మాత్రమే ఓడింది.




# మెరిసిన భరత్, విజయ్



జైపూర్: ప్రొ కబడ్డీ సీజన్-12లో తెలుగు టైటాన్స్ మరో విజయాన్ని అందుకుంది. భరత్ (9), విజయ్ మలిక్ (7) సత్తా చాటడంతో మంగళవారం ఉత్కంఠభరితంగా సాగిన పోరులో 30-29తో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించింది. ఆరంభం నుంచి టైటాన్స్ దూకుడుగా ఆడింది. 7-3తో ఆధిక్యంలోకి వెళ్లింది. తర్వాత గుజరాత్ కాస్త పుంజుకున్నా.. టైటాన్స్ 12-10తో బ్రేక్‌కు వెళ్లింది. ద్వితీయార్థంలో పోటీ నువ్వానేనా అన్నట్లు సాగింది. ఒక దశలో గుజరాత్ 24-26తో టైటాన్స్‌కు సమీపంగా వచ్చింది. ఆఖర్లో ఒత్తిడికి నిలిచిన టైటాన్స్ ఒక్క పాయింట్ తేడాతో ప్రత్యర్థిని వెనక్కి నెట్టింది. మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్.. యు ముంబాను ఓడించింది. నిర్ణీత సమయానికి రెండు జట్లు 38-38తో సమానంగా నిలిచాయి. దీంతో అదనంగా అయిదు రెయిడ్‌లు ఆడించగా.. జైపూర్ 6-4తో ముంబాపై పైచేయి సాధించింది. జైపూర్ తరపున నితిన్ (14) రాణించాడు.

# కరుణ్ ఉంటాడా!



ముంబయి: స్వదేశంలో వెస్టిండీస్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్‌లో ఆడే భారత జట్టులో వెటరన్ బ్యాటర్ కరుణ్ నాయర్‌కు చోటు దక్కడం కష్టంగానే కనిపిస్తోంది. ఈ సిరీస్‌లో ఆడే జట్టును సెలక్టర్లు బుధవారం ఎంపిక చేసే అవకాశాలున్నాయి. సుదీర్ఘ విరామం తర్వాత భారత టెస్టు జట్టులో స్థానం దక్కించుకున్న కరుణ్.. ఇంగ్లాండ్ పర్యటనలో రాణించలేకపోయాడు. ఎనిమిది ఇన్నింగ్స్‌ల్లో 25.06 సగటుతో 205 పరుగులే చేయగలిగాడు. ఇందులో ఒక్క అర్ధసెంచరీ మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో అతడి స్థానంలో దేవ్‌దత్ పడిక్కల్‌కు చోటు కల్పించే అవకాశాలున్నాయి. పడిక్కల్ మంచి ఫామ్‌లో ఉన్నాడు.

ఇటీవలే భారత్‌ఎ తరఫున ఆస్ట్రేలియాఎపై టూర్ మ్యాచ్‌లో 150 పరుగులు సాధించాడు. పేస్ ఆల్‌రౌండర్ కోటాలో నితీష్‌కుమార్ రెడ్డికి కూడా చోటు దక్కే ఛాన్స్ ఉంది. రిషబ్ పంత్‌కు గాయం కావడంతో ధ్రువ్ జురెల్ అతడి స్థానాన్ని భర్తీ చేయచ్చు. మరో వికెట్‌కీపర్ బ్యాటర్ నారాయణ్ జగదీశన్‌ను జురెల్‌కు బ్యాకప్‌గా ఎంపిక చేసే అవకాశాలున్నాయి. ఒకటి రెండు మార్పులు తప్పా.. దాదాపు ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో ఆడిన జట్టే విండీస్‌పైనా బరిలో దిగొచ్చు. బీసీసీఐ సమావేశం అనంతరం వెస్టిండీస్‌తో సిరీస్‌కు జట్టును ప్రకటిస్తామని బోర్డు కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా ఇప్పటికే ఖరారు చేశారు. శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమ్‌ఇండియా.. ఇంగ్లాండ్‌తో అయిదు టెస్టుల సిరీస్‌ను 22తో సమంగా ముగించిన సంగతి తెలిసిందే. భారత్‌విండీస్ మధ్య తొలి టెస్టు అహ్మదాబాద్‌లో అక్టోబర్ 2న ఆరంభం కానుంది. రెండో టెస్టు 10వ తేదీని దిల్లీలో మొదలవుతుంది.

# సీనియర్ జట్టుకు కోచింగ్‌పై దృష్టి : శ్రీజేశ్



దిల్లీ: వచ్చే అయిదేళ్లలో భారత సీనియర్ హాకీ జట్టు ప్రధాన కోచ్‌గా ఎదిగేందుకు కృషి చేస్తున్నట్లు మాజీ గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్ చెప్పాడు. "25 ఏళ్లు ఆటగాడిగా కొనసాగా. కోచింగ్ నాకు కొత్త. ప్రస్తుతం జూనియర్ జట్టుకు శిక్షణ ఇస్తున్నా. కోచ్ పాత్రలో అలవాటు పడటానికి ఇదే సరైన మార్గం. సీనియర్ జట్టుకు శిక్షణ ఇవ్వాలంటే పరిణతి సాధించాలి. ఉన్నట్టుండి ఆ స్థాయికి వెళ్లలేం. ఇప్పటికే ఎఫ్ఐహెచ్ లెవల్-3 కోచింగ్ కోర్సు పూర్తి చేశాను. వచ్చే అయిదేళ్లలో భారత సీనియర్ జట్టుకు కోచ్ కావాలనే పట్టుదలతో ఉన్నా" అని శ్రీజేశ్ తెలిపాడు. భారత్ వేదికగా జరిగే ప్రపంచకప్‌లో భారత్‌కు ట్రోఫీ గెలిచే సత్తా ఉందని అతడు ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు.

నేడు హాకీ ఇండియా లీగ్ వేలం: హాకీ ఇండియా లీగ్ 2026 సీజన్ మినీ వేలం బుధవారం జరగనుంది. పురుషులు, మహిళల విభాగాల్లో వందకు పైగా ప్లేయర్లు ఈ వేలంలో అందుబాటులో ఉండనున్నారు. ఈ లీగ్‌లో ప్రతి జట్టులో 20 మంది క్రీడాకారులు ఉంటారు. అన్ని టీమ్‌లు అత్యధికంగా ఏడుగురు విదేశీయులు.. ముగ్గురు భారత జూనియర్ ప్లేయర్లను ఎంపిక చేయాలి. క్రీడాకారుల కనీస ధరలు రూ.2 లక్షలు, 5 లక్షలు, రూ.10 లక్షలుగా నిర్దేశించారు. పురుషుల్లో ఎనిమిది జట్లు.. మహిళల్లో నాలుగు జట్లు ఈ లీగ్‌లో ఆడుతున్నాయి.

# ఎర్ర బంతి క్రికెట్‌కు శ్రేయస్ విరామం



దిల్లీ: వెన్ను నొప్పి బాధిస్తుండడంతో ఎర్ర బంతి ఫార్మాట్ నుంచి విరామం తీసుకోవాలని మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ నిర్ణయించుకున్నాడు. ఈ విషయాన్ని అజిత్ అగార్కర్ సారథ్యంలోని సెలక్షన్ కమిటీకి వెల్లడించాడు. విండీస్‌తో స్వదేశంలో జరిగే టెస్టు సిరీస్‌కు తన పేరును పరిగణనలోకి తీసుకోవద్దని అతడు తెలిపాడు. ప్రస్తుతం లఖ్‌నవూలో భారత్-ఎ, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న అనధికార టెస్టుకు కూడా శ్రేయస్ దూరమయ్యాడు. అక్టోబర్ 15న ఆరంభమయ్యే రంజీ ట్రోఫీలో సైతం అతడు ఆడడం అనుమానంగానే ఉంది. వెన్నునొప్పి నుంచి కోలుకునేందుకు శ్రేయస్.. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు వెళ్లనున్నాడు